
ఏటుకూరులో బేస్‌మెంట్ వరకే నిలిచిపోయిన జగనన్న ఇళ్లు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

3

శనివారం 20 జనవరి 2024



నాలుగేళ్లుగా.. నత్తనడకన


ఏటుకూరు జగనన్న కాలనీలో రోడ్డు దుస్థితి

రోడ్లు లేవు.. డ్రెయిన్లు లేవు.. తాగునీరు, కరెంటు లేదు.. అయినా కనాకష్టంగా ఇల్లు కట్టుకుంటే రవాణా, ఇతర సౌకర్యాలు లేవు. ఇదీ జిల్లాలోని జగనన్న కాలనీల దుస్థితి. పేరుగొప్ప, ఊరుదిబ్బ అను చందంగా జగనన్నకాలనీలు ఉన్నాయి. ఆర్భాటంగా స్థలాలిచ్చి అధికారుల కు లక్ష్యాలు పెట్టి లబ్ధిదారులపై ఒత్తిళ్లు తెచ్చినా కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగు తున్నాయి. పండుగలు వస్తు న్నాయి.. పోతున్నాయే కానీ గృహ ప్రవేశాలు ప్రభుత్వం అనుకు న్నట్లుగా కావడంలేదు. ఇల్లు కట్టుకోకుంటే స్థలం పోతుం దని.. లేదంటే మరొకరికి ఇచ్చేస్తామని లబ్ధిదారులను బెదిరించి మరీ ఇళ్లను నిర్మించుకునేలా అధికారులు చేసినా పెద్దగా నిర్మా ణాలు సాగలేదు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు.. ఇల్లు కట్టుకున్న తర్వాత నివాసం ఉండేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించటంలో అధికా రులు విఫలమయ్యారు. దీంతో అత్యధిక కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు అరకొరగానే జరిగాయి. ఎన్నికలు సమీ పిస్తున్న నేపథ్యం లో వీలైనన్ని ఎక్కువ ఇళ్లు ఈ నెలాఖరు కల్లా పూర్తి చేయించి ఫిబ్ర వరిలో సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించినా ఆ పరిస్థితి ఎక్కడా కానరావడంలేదు.

లబ్ధిదారుల లబోదిబో

వైసీపీ ప్రభుత్వం ఎంతో ఘనంగా చెప్పుకుంటోన్న జగనన్న కాలనీల లేఅవుట్‌లు ఒక్క వర్షానికే నీటి తటాకాలుగా మారిపోతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో లేఅవుట్లు ఉండటంతో వర్షపు నీరు పోయే మార్గం లేదు. ఎప్పటికైనా భూమిలోకి ఇంకి పోవాల్సిందే తప్ప బయటకు పోయే పరిస్థితి లేదు. లేఅవుట్లలో అంతర్గత రోడ్లు, కాలువలు, విద్యుత్, బోర్ల సౌకర్యాల పేరుతో రూ.కోట్లు వెచ్చించినట్లుగా అధికార వర్గాలు చెబుతున్నా.. ఆ పరిస్థితి ఎక్కడా లేదు. ఓ మోస్తరు వర్షానికి లేఅవుట్లలో లోపాలు బహిర్గతమౌతున్నాయి. వందల లారీలు మట్టిపోసి స్థలాన్ని ఎత్తు పెంచుకుని ఇళ్లు నిర్మించుకున్నా వర్షపు నీరు చుట్టుముట్టేస్తుందని బాధితులు వాపోతున్నారు.

పండుగలు పోతున్నాయి..

జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలకు ముహూర్తాలు మారిపోతున్నాయే కానీ పేదల కల నెరవేరడంలేదు. ఉగాది, దసరా, దీపావళి ఇలా ప్రతి పండక్కి జగనన్న కాలనీల నిర్మాణం విషయంలో ఘనంగా లక్ష్యాలు పెట్టుకోవడం ఆ తర్వాత వాటిని విస్మరించడం ప్రభుత్వానికి రివాజుగా మారింది. ఆరు నెలల క్రితం వరకు జగనన్న ఇళ్ల నిర్మాణం పురోగతి మీద వారాంతపు సమీక్షలతో ప్రభుత్వం హడావిడి చేసేది. ఒక దశలో యంత్రాంగానికి సైతం లక్ష్యాలు విధించి ఒత్తిడికి గురిచేసేది. అలాంటిది ప్రస్తుతం కాలనీల నిర్మాణం పురోగతిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.

అసంపూర్తిగా జగనన్న కాలనీలు

- ఇళ్ల లక్ష్యాలు ఘనం.. పురోగతి శూన్యం
- ఎండమావిగానే మౌలిక వసతుల కల్పన
- ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా పనులు
- పేదల ఇంటికి చిల్లిగవ్వ విదిల్చని రాష్ట్ర ప్రభుత్వం
- సమస్యలు పట్టించుకోని అధికారులు.. లబ్ధిదారుల అవస్థలు


ఏటుకూరులో పూర్తికాని జగనన్న ఇళ్లు


తాడికొండ శివారు బడేపురంలో ఇళ్ల నిర్మాణాలు జరగక నిర్మానుష్యంగా ఉన్న జగనన్న కాలనీ

(ఆంధ్రజ్యోతి - గుంటూరు బృందం)

కాలనీలు కాదు.. ఊళ్లను నిర్మిస్తున్నామని ప్రభుత్వం జగనన్న కాలనీల ప్రారంభోత్సవంలో ప్రకటించింది. పదుల ఎకరాల్లో లేఅవుట్లు వేసి వందల మందికి స్థలాలు ఇచ్చింది. అయితే నాలుగేళ్లు అవు తున్నా కాలనీలు ఊళ్లుగా మారలేదు కాని చిట్టడవులు, బురదగుం తలను తలపించేలా మారాయి. 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేసిన హడావుడి ప్రకటనలకే పరిమితమైందని జగనన్నకాలనీల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది. పేదలందరికీ స్థలాలు ఇచ్చి, వారికి ఇళ్లు నిర్మించి ఇస్తానని ముఖ్యమంత్రి చెప్పిన మాట ఆచరణలో నీటి మూటగానే మిగిలిపోయింది. ఇళ్లు నిర్మించి ఇచ్చే విషయంలో ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేసి మెలిక పెట్టడంతో లబ్ధిదారులు నిర్మాణాలపై వెనుకంజ వేశారు. పేదల ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం చిల్లి గవ్వ కూడా విదల్చలేదు.

అరకొర వసతులు.. అప్పులు పాలు

పీఎంఏవై కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.లక్షా 80 వేలను తానిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటోంది. లబ్ధిదారుల పేరుతో డ్వాక్రా రుణం రూ.35 వేలు తీసుకుంది. ఈ మొత్తం రూ.2.15 లక్షలతో ఇల్లు కట్టుకోలేక లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఫలితంగా జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షల సాయం చేస్తానని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు ఇది పూర్తిగా అందిన దాఖలాలు లేవు. పైగా మొదట వారు ఖర్చు పెడితే తిరిగి చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు అమలుకు నోచుకోలేదు. కొందరైతే వచ్చిన స్థలం పోతుందేమోనని తమ వద్ద ఉన్నదంతా ఖర్చు చేసి, అప్పులు తెచ్చి నానా అగచాట్లు పడి నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ నిర్వాకం, అధికారుల ఒత్తిడి కారణంగా పేదలకు సొంతింటి కల నెరవేరకపోగా, అప్పులపాలై ఆర్థికంగా చితికి పోతున్నారు. అష్టకష్టాలు పడి ఇళ్లు నిర్మించుకున్న వారు కాలనీల్లో మౌలిక వసతుల లేక అల్లాడిపోతున్నారు. కాల్వలు నిర్మించకపోవడంతో చిన్న పాటి వర్షాలకే కాలనీలు తటాకాలను తలపిస్తున్నాయి. అధ్వాన పారిశుధ్యంతో దోమలు, దుర్వాసనలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నా అధికారులకు పట్టడంలేదు. కాలనీల్లో మౌలిక వసతులు లేకపోవడంతో లబ్ధిదారుల ఇక్కట్లకు అంతేలేదు. తాగునీటి సౌకర్యం లేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకపోవటంతో చిత్తడిగా మారిన రోడ్లపై వెళ్ళలేక పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. రాత్రిళ్లు పాములు, విషపురుగుల సంచారం ఎక్కువగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల నుంచి రవాణా సౌకర్యం కూడా సరిగా లేదని కాలనీవాసులు వాపోతున్నారు. దీంతో ఇళ్లల్లో చేరిన వారు సైతం వాటిని ఖాళీ చేసి వెళ్లిపోతు న్న దుస్థితి నెలకొంది.


ఏటుకూరులో మురుగునీరు, గడ్డితో నిండిపోయిన జగనన్న ఇళ్లు


ఏటుకూరులో పునాదులకే పరిమితమైన జగనన్న ఇళ్లు

14 శాతమే నిర్మాణాలు..

గుంటూరు జిల్లాలో జగనన్న కాలనీల పేరిట 209 లేఅవుట్లలో 67,258 ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాలుగున్నరేళ్లుగా లబ్ధిదారులపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చి 15,607 ఇళ్లు పూర్తి చేసింది. అక్టోబరులో కొద్దిమందికి ఇళ్లు ఇచ్చి, గృహప్రవేశాల తతంగం నడిపి మొత్తం ఇళ్లు ఇచ్చేసినట్లు హడావుడి చేసింది. తీరా చూస్తే జిల్లాలో ఇంకా 51,165 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లోనే ఆగిపోయాయి. జిల్లాలో 20.397 ఇళ్ల నిర్మాణం ప్రారంభ దశలో ఉండగా, 764 ఇళ్లు ఇప్పటికీ నిర్మాణానికి నోచుకోలేదు. 26,032 ఇళ్లు పునాదుల దశ దాటలేదు. 2,727 ఇళ్లు శ్లాబుదశకు చేరగా, 1,403 ఇళ్లకు మాత్రమే శ్లాబు పడింది. మొత్తంగా జిల్లాలో కిందటి నెల 16,910 ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యం పెట్టుకోగా అందులో 14 శాతం, అంటే 2,366 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. పొన్నూరు, తాడికొండ నియోజక వర్గాల్లో 8 శాతం, తెనాలిలో 10 శాతం, గుంటూరు పశ్చిమ, ప్రత్తిపాడుల్లో 15శాతం, మంగళగిరిలో 17 శాతం, గుంటూరు తూర్పులో 28 శాతం నిర్ణయించిన లక్ష్యాలు నెరవేరాయి.

నిర్మాణాలకు విముఖత

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకి లబ్ధిదారులు విముఖత చూపుతున్నారు. మౌలిక సదుపాయాల కల్పన సరిగా లేక, ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు సరిపోవనే ఉద్దేశంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తిస్థాయిలో ప్రారంభించడం లేదు. తాడికొండ మండలంలో 2585 మందికి పట్టాలు మంజూరు చేయగా ఇప్పటి వరకు 398 మంది మాత్రమే ఇంటి నిర్మాణాలు చేసుకున్నారు. తాడికొండ శివారు బడేపురంలో 2022 జూలైలో 725 మందికి పట్టాలను ఎమ్మెల్యేలు ఉండవల్లి శ్రీదేవి, ముస్తఫాలు పంపిణీ చేశారు. అయితే ఇప్పటి వరకు వారిలో ఒక్కరు కూడా ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించలేదు. పట్టాలు పొందిన వారిలో పలువురు స్థలాన్ని రూ.50 నుంచి రూ.2 లక్షల వరకు విక్రయిస్తున్నారని సమాచారం.

గడిచిన నెలలో నిర్మాణ ప్రగతిని పరిశీలిస్తే...

నియోజకవర్గం	నిర్మాణం	పూర్తి
పొన్నూరు	6,148	159
తాడికొండ	3,179	98
తెనాలి	4,666	481
గుంటూరుపశ్చిమ	3,441	486
గుంటూరు తూర్పు	7,127	646
ప్రత్తిపాడు	8,440	402
మంగళగిరి	7,127	94

22న తుది ఓటర్ల జాబితా ప్రచురించాలి

- రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఎంకే మీనా


సీఈవో ఎంకే మీనా నిర్వహించిన వీసీకి హాజరైన కలెక్టర్, జేసీ, కమిషనర్

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024 ఓటర్ల తుది జాబితాలను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఈ నెల 22న ప్రచురించాలని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్‌కుమార్‌మీనా కలెక్టర్‌ని ఆదేశించారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024, ఎన్నికలకు సంబంధించి అంశాలపై శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఎస్‌ఎస్‌ఆర్ 2024కు సంబంధించి సోమవారం ప్రచురించే తుది జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. క్లెయిమ్‌ల పరిష్కారం, అభ్యంతరాలపై తీసుకున్న చర్యలు తదితర వివరాలను గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులకు అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం మౌలిక సౌకర్యాల కల్పన పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో అన్ని శాఖల ఉద్యోగుల వివరాల సేకరణతో పాటు ఈసీఐ పాలసీ ప్రకారం ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, డీఆర్వో చంద్రశేఖరరావుతో కలసి పాల్గొన్నారు. సమావేశంలో ఈఆర్వోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు లక్ష్మీకుమారి, గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి, ఆర్డీవో శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు, కో ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ శిరీష, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

సీఐడీ విచారణకు తెలుగు యువత నేతలు

4 లో..

మోసపూరిత పాలనకు చరమగీతం తప్పదు
- పాలకుల ప్రయోజనం కోసమే మూడు ముక్కలాట
- 1494 వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

పాల వెల్లువ కేంద్రంలో వ్యాపారం

- పాల సేకరణ నై.. ఎరువుల అమ్మకాలకు సై
- ప్రభుత్వ భవనంలో సర్పంచ్ వ్యాపారంపై విమర్శలు

గురజాలటౌన్, జనవరి 19: అది జగనన్న పాల వెల్లువ కేంద్రం.. అయితే అక్కడ జరుగుతుంది మాత్రం ఎరువుల వ్యాపారం. జగనన్న పాల వెల్లువ అని పెద్దపెద్ద అక్షరాలతో భవనం ఉంది. కానీ లోపలికెళ్తే మాత్రం అక్కడ ఎరువుల బస్తాల అమ్మకాలు జరుగుతున్నాయి. పాల సేకరణ అధికంగా ఉన్న గ్రామాల్లో ప్రభుత్వం జగనన్న పాల వెల్లువ మహిళా డెయిరీ సహకార సంఘం పేరిట భవనాలు నిర్మించింది. అయితే నిజానికి అక్కడ ఎటువంటి పాల సేకరణ జరగకపోగా వైసీపీ నేతలు తమ వ్యాపారాలకు ఆ భవనాలను వినియోగించుకుంటున్నారు. ఇందుకు సజీవ సాక్ష్యంగా మండలంలోని గోగులపాడులో పరిస్థితి ఉంది. గ్రామంలో రూ.15.74 లక్షలతో జగనన్న పాల వెల్లువ భవనాన్ని నిర్మిం చారు. ఈ భవనాన్ని గతేడాది మార్చి 10న ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ప్రారంభించారు. అయితే అక్కడ ఎటువంటి పాల సేకరణ జరగడం లేదు. ప్రధాన రహదారి, సచివాలయం పక్కనే ఈ భవనం ఉంది. దీంతో సర్పంచ్ ఈ భవ నాన్ని తన వ్యాపారానికి వినియోగించుకుంటున్నారు. సర్పంచ్.. పైగా అధికార పార్టీ నేత కావడంతో అక్రమంగా ప్రభుత్వ భవనాన్ని వినియోగించుకోవడంపై అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. సర్పంచ్‌గా గ్రామాభి వృద్ధికి కృషి చేయాల్సిన ఆయన ప్రభుత్వ భవనాన్ని సొంతానికి వినియోగిస్తుండడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో ఫణికుమార్‌ను వివరణ కోరగా.. తన దృష్టికి రాలేదని, విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



బస్సులు లేక.. ఇక్కట్లు

- బస్టాండ్లలో ప్రయాణికుల పడిగాపులు
- అరకొర సర్వీసులతో ప్రయాణానికి పాట్లు
- సీఎం సభకు జిల్లా నుంచి ఆర్టీసీ బస్సులు


బస్సుల్లేక వెలవెలబోతున్న ఎన్‌టీఆర్ బస్టాండ్

గుంటూరు, జనవరి 19: విజయవాడలో శుక్రవారం సీఎం జగన్‌మోహనరెడ్డి సభ ఆర్టీసీ ప్రయాణికులకు చుక్కలు చూపించింది. జనసమీకరణకు ఎక్కడికక్కడ డిపోల నుంచి బస్సులను కేటాయించారు. దీంతో రోజువారీ, పండుగ సెలవుల అనంతరం సొంతూళ్లకు వెళ్లే వారు బస్సుల కొరతతో ఇక్కట్లు పడ్డారు. డిపోలు, బస్టాండ్లలో బస్సుల కోసం గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సివచ్చింది. ఉన్న అరకొర బస్సులు పెద్దసంఖ్యలో ప్రయాణికులతో కిటకిటలాడాయి. బస్సు ఎక్కేందుకు తోపులాటకు దిగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సంక్రాంతి సెలవుల అనంతరం ప్రయాణికుల రద్దీ ఉంటుందని తెలిసి అత్యధికంగా బస్సులను సీఎం సభకు కేటాయించిన ఆర్టీసీ తీరుపై ప్రయాణికులు మండిపడ్డారు. బస్సులు లేకపోవడంతో గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఖాళీ ప్లాట్ ఫామ్‌లతో వెలవెలబోయాయి. ప్రభుత్వ పెద్దలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 630 బస్సులను ఏర్పాటు చేయడంతో ప్రజలు ప్రయాణాలకు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. చంటి పిల్లలతో తల్లులు, వృద్ధులు పడిన అవస్థలు చెప్పనలవికావు. బస్సులను సీఎం సభకు ఏర్పాటు చేసి తమను ఇబ్బందులకు గురిచేయడం దారుణమని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సులను తరలించడంతో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రయాణికులు నానా పాట్లు పడ్డారు. సమయానికి బస్సులు లేక ప్రయాణికులు ఆటోలను, కార్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే అవకాశంగా ప్రైవేట్ వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేశారు. పల్లె వెలుగు రూట్లలో అరకొరగా సర్వీసులు ఉండటంతో ప్రయాణికులు నరకయాతన పడాల్సి వచ్చింది. అమరావతి, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, తుళ్లూరు, పర్చూరు, తెనాలి, నరసరావుపేట, చిలకలూరిపేట రూట్లలో వెళ్లే పల్లెవెలుగు సర్వీసులు తగినన్ని లేకపోవడంతో ప్రయాణికులు ప్రత్యక్ష నరకం చవి చూడాల్సి వచ్చింది.

జనసమీకరణకు విశ్వప్రయత్నాలు

విజయవాడలో సీఎం జగన్ సభను విజయవంతం చేసేందుకు శుక్రవారం అధికార పార్టీ నేతలు విశ్వప్రయత్నాలు చేశారు. గుంటూరులో పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల నుంచి జనసమీకరణ కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది. డివిజన్ల వారీగా జనసమీకరణకు టార్గెట్లు పెట్టినా ప్రజల నుంచి స్పందన కనిపించలేదు. రెండు సచివాలయాలకు ఒక బస్సును ఏర్పాటు చేసి జనసమీకరణ చేయాలని కార్పొరేటర్లు, డివిజన్ పార్టీ అధ్యక్షులకు ప్రభుత్వ పెద్దలు ఆదేశాలు జారీ చేశారు. అయితే మధ్యాహ్నం 12 గంటలు దాటినా ఒస్సుల వద్దకు కార్యకర్తలు ఆశించిన స్థాయిలో ఎవరూ రాలేదు. దీంతో కొన్ని దగ్గర్ల కార్పొరేటర్లు వలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కొన్ని ప్రాంతాల్లో సగం సీట్లతోనే బస్సులు బయల్దేరాల్సి వచ్చింది. బస్సుల్లో ఎక్కిన వారికి పలావు, చికెన్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ ప్రత్యేకంగా తయారు చేయించి మరీ అందజేశారు. సీఎం సభ కోసం ఆర్టీసీ బస్సులే కాక విద్యా సంస్థలకు సెలవు ప్రకటించి వారి బస్సులను కూడా వినియోగించారు.


బస్టాండ్‌లో ప్రయాణికుల పడిగాపులు


సీఎం సభ కోసం పశ్చిమలో ఏర్పాటు చేసిన ప్రైవేటు కళాశాల బస్సు



తుళ్లూరు రైతు ధర్నా శిబిరం నుంచి నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

మోసపూరిత పాలనకు చరమగీతం తప్పదు

● పాలకుల ప్రయోజనం కోసమే మూడు ముక్కలాట

● 1494 వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్లూరు జనవరి 19: మోసపూరిత పాలనకు చరమగీతం తప్పదని రాజధాని అమరావతి నిర్మాణానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1494వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు ధర్నా శిబిరాల నుంచి మాట్లాడుతూ అమరావతి ప్రజా రాజధాని అని స్పష్టం చేశారు. మూడు రాజధానులనేది వైసీపీ పాలకుల ప్రయోజనం కోసమేనన్నారు. అమరావతి ప్రాంతం అటు శ్రీకాకుళానికి, ఇటు అనంతపురానికి సమదూరంలో ఉన్నటువంటి ప్రదేశమన్నారు. అన్నీ సౌకర్యాలతో ఏర్పాటు కాబోతున్న అమరావతిని సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కల ఆటతో నాశనం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అమరావతిని అభివృద్ధి చేయాలని ఉన్నత న్యాయస్థానం సూచించినా లెక్కలేకుండా వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. పాలకులు మారినంత మాత్రం రాజధాని మారదన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

కోర్టుకు జగన్ ఎందుకు వెళ్ళటం లేదు?



● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 19: కోడి కత్తి కేసులో సీఎం జగన్ ఎందుకు కోర్టుకు హాజరు కావటం లేదని?, కోర్టులంటే జగన్‌కు అంత భయమెందుకో?, ప్రజలకైనా సమాధానం చెప్పాలని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు డిమాండ్ చేశారు. గత ఐదు సంవత్సరాలుగా జైల్లో మగ్గిపోతున్న ఒక నిరుపేద దళిత యువకుడు శ్రీను కేసులో జగన్ తీరు పైనే అందరికీ అనుమానాలు కలుగుతున్నాయని, కనీసం అతడికి బెయిల్ కూడా రాకుండా అడ్డు పడుతూ జగన్ ప్రజల అనుమానాలను మరింత నిజం చేస్తున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని తన నివాస గృహంలో ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడుతూ నాడు విశాఖ విమానాశ్రయంలో జరిగిన ఘటనలో ఎలాంటి రాజకీయ కోణం లేదని, జగన్ పై అభిమానంతోనే శ్రీను ఆపని చేసినట్లు స్వయానా జాతీయ దర్యాప్తు సంస్థే తేల్చినా మరింత లోతైన విచారణ కోరుతూ జగన్ కేసును సాగ దీయటం ఆయన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కాదా? అని ప్రశ్నించారు. నాడు ఎన్నికల ముందు సొంత బాబాయి వైఎస్ వివేకా హత్య కేసు, కోడి కత్తి కేసు ఘటనలను రాజకీయ ప్రయోజనాలకు వాడుకున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు పై లేని పోని అభాండాలు వేశారని, ఈ రెండు కేసుల్లో సీబీఐ, ఎన్ఐఏలు వాస్తవాలు వెల్లడించాయని అన్నారు.

భూహక్కుల చట్టం రైతులకు నష్టదాయకం

● రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య



మాట్లాడుతున్నరైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య

తెనాలి రూరల్, జనవరి 19: ప్రభుత్వం దొడ్డిదారిన తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో ప్రజలకు తీవ్ర నష్టంజరగనున్నదని, ఆ చట్టం రద్దయ్యేంతవరకూ తామంతా పోరాడతామని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అన్నారు. పట్టణంలోని చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో భూ హక్కుల చట్టం - రైతులకు నష్టకరం అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ పెట్టుబడి దారులకు వారు కోరుకున్న రీతిలో భూములను కట్టబెట్టేందుకే ఈ చట్టాన్ని తెచ్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉంటే వారి కబంధహస్తాల్లో భూమి హక్కు ఉండే విధంగా తెచ్చిన చట్టంతో వారసత్వంగా ప్రజలకు వస్తున్న భూములపై హక్కును కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాల్ మాట్లాడుతూ ల్యాండ్ టైట్లింగ్ యాక్టు ద్వారా భూ సంబంధిత వివాదాలను ట్రిబ్యునల్ ద్వారా రెండేళ్ల కాలపరిమితిలో పరిష్కరిస్తామని చెబుతున్నారని అదెలా సాధ్యమని ప్రశ్నించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి, తెలుగు రైతు నాయకులు ఈదర వెంకటపూర్ణచంద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ చందుసాంబశివుడు తదితరులు ప్రసంగించారు. సీనియర్ న్యాయవాది ఎన్‌వి. మహేశ్వరరావు, కెవి సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, కె.పూర్ణచంద్రరావు, వై. బ్రహ్మేశ్వరరావు, ఆళ్ళ సాంబిరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, ఎస్.రాజ్యలక్ష్మి, ఎం.సాంబశివరావు, డి.సాంబశివరావు, అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతిని అడ్డుకుంది జగనే

● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్(చేబ్రోలు), జనవరి 19: మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్థాయిని తగ్గించే విధంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్నారన్ని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ధ్వజమెత్తారు. చేబ్రోలులో శుక్రవారం టీడీపీ, జనసేన పార్టీల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో నరేంద్ర మాట్లాడుతూ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటులో ఆయన పేరుతో సమానంగా జగన్‌రెడ్డి తన పేరు పెట్టుకోవటం మంచిది కాదన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం సబ్‌ప్లాన్‌ను రూపొందించి వారికి ప్రత్యేక నిధులను కేటాయించారని గుర్తు చేశారు. ఆ సబ్‌ప్లాన్ నిధులను దుర్వినియోగం చేసి కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విదేశీ విద్య పథకానికి అంబేద్కర్ పేరును తొలగించి జగన్‌రెడ్డి తన పేరు పెట్టుకొని మహనీయుడిని అవమానించాడని ఆరోపించారు. రాష్ట్రంలో డాక్టర్ సుధాకర్ దగ్గర నుంచి 300లకు పైగా దాడులు దళితులపై జరిగాయని ఆరోపించారు. 27 పథకాలు దళితులకు నిలిపివేసి వారి అభ్యున్నతిని అడ్డుకున్నది జగన్ కాదా అన్ని ప్రశ్నించారు. పొన్నూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు మాట్లాడుతూ వైసీపీ పాలనలో బడుగు బలహీన వర్గాలు, దళితులపై అకృత్యాలు పెరిగిపోయాని ఆరోపించారు. కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్లను నియమించటమే కానీ, కార్యాలయాలు కానీ, నిధులు కానీ విడుదల చేయలేదన్నారు. రైతులను ఆదుకోలేని దౌర్భాగ్య పరిస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. సమావేశంలో నియోజకవర్గ స్థాయి పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని మండలాల టీడీపీ, జనసేన సమన్వయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేమన పద్యాలకు కాలదోషం లేదు

● కొండవీడులో ఘనంగా యోగి వేమన జయంతి వేడుకలు



వేమన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న జిల్లా అటవీశాఖాధికారి రామచంద్రరావు

కొండవీడుకోట(యడ్లపాడు), జనవరి19: వేమన పద్య రూపంలో చెప్పిన హితవచనాలకు కాలదోషం లేదని, భూమ్యాకాశాలు ఉన్నంతవరకూ దిక్సూచిగా నిలుస్తాయని ప్రముఖ గ్రంథ సంపాదకుడు, ఉపాధ్యాయుడు మోదుగుల రవికృష్ణ అన్నారు. యడ్లపాడు మండలంలోని చారిత్రక కొండవీడుకోటలో ప్రజాకవి యోగి వేమన జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పల్నాడుజిల్లా అటవీశాఖాధికారి ఎస్.రామచంద్రరావు వేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవికృష్ణ మాట్లాడుతూ యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. కొండవీడుకోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాహిత్య అభిలాషులు ఇందుకూరి వెంకటరెడ్డి, రేంజ్ అధికారి వెంకటరమణమ్మ, కొండవీడు బీట్ అధికారి పురుషోత్తమరాజు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐడీ విచారణకు తెలుగు యువత నేతలు



సీఐడీ విచారణకు వెళుతున్న తెలుగుయువత నాయకులు ఫిరోజ్, శివకేశవలతో రావిపాటి సాయి, న్యాయవాదులు

గుంటూరు, జనవరి 19: దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ పెట్టిన కేసులో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు షేక్ ఫిరోజ్, ఐ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండి శివ కేశవ శుక్రవారం సీఐడీ విచారణకు హాజరయ్యారు. మైనార్టీ వర్గానికి చెందిన తనను పవిత్ర శుక్రవారం నమాజ్ కూడా చదువుకోనీయకుండా విచారణ పేరుతో మానసిక వేధింపులకు గురిచేశారని ఫిరోజ్ ఆవేదన వ్యక్తం చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం 30 నుంచి 40 ప్రశ్నలు వేసి తమ మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు జప్తు చేసారని వాపోయారు. తమను ఈ నెల 30న రావాలని మరో నోటీసు ఇచ్చారని తెలిపారు. ఇద్దరితో పాటు న్యాయవాదులు మాజీ పి.పి శ్రీరామ్ రాజీవ్ ఆనంద్, హైకోర్టు న్యాయవాది పొన్నం రవీంద్రబాబు విచారణకు హాజరయ్యారు. గుంటూరు పశ్చిమ టీడీపీ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ, రాష్ట్ర మైనారిటీ నేతలు హసైన్, బాజీ మాస్టర్, షేక్ నాయబ్ రసూల్, షేక్ రషీద్, ఐ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బేతమల మనిరత్నం, కోసూరి సతీష్ గౌడ్, మల్లెంపూడి శ్రీనివాస రావు, కొల్లి నాగుల్ షేక్ సుభాని, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షులు గుత్తికొండ కిరణ్ యాదవ్, తెలుగుయువత నాయకులు షేక్ రఫీ, చిక్కాల శివరామ కృష్ణ, శొంఠినేని అనిల్, శేషాద్రి సాంబశివరావు, గాలి ఉపేంద్ర, బుల్లా కుమార్ బాబు, కళ్యాణ్ తదితరులు వారికి సంఘీబావం తెలిపారు.

గాజువాకలో గుంటూరు యువకుడి ఆత్మహత్య

విశాఖపట్నం, జనవరి 19: విశాఖ నగరం గాజువాకలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో యువకుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి...గుంటూరు నగరానికి చెందిన ఎస్.సాయికృష్ణ (26) గాజువాకలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో పనిచేసుకుంటూ అక్కడే ఉంటున్నాడు. దీంతో పాటు ఫుడ్ డెలీవరీ బాయ్‌గా కూడా పనిచేస్తున్నాడు. కాగా సాయికృష్ణ తండ్రి ఇటీవల గాజువాక వచ్చి సంక్రాంతికి ఇంటికి రావాలని చెప్పి వెళ్లిపోయాడు. అయినప్పటికీ సాయికృష్ణ స్వగ్రామం వెళ్లలేదు. శనివారం ఉదయం హాస్టల్‌లో అతడి గది తలుపు ఎంతకీ తీయకపోవడంతో అనుమానం వచ్చిన సిబ్బంది తలుపు తెరచి చూడగా, ఫ్యాన్ హుక్కుకు ఉరి వేసుకుని ఉన్నాడు. దీంతో వారు వెంటనే గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలంలో వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

● ఏపీఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ త్రివిక్రమ వర్మ




క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీజీ త్రివిక్రమ వర్మ

పెదకాకాని, జనవరి19: క్రమం తప్పకుండా రోజు క్రీడలు ఆడటం వల్ల మానసిక ఉల్లాసం, దేహధారుఢ్యం కలుగుతుందని ఏపీ ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీఎం త్రివిక్రమ వర్మ తెలిపారు. సీఎం జగన్ ప్రతిపాదించిన ఆడుదాం ఆంధ్రాలో భాగంగా శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏపీఎస్పీఎఫ్ స్పోర్ట్స్ మీట్- 2024ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా త్రివిక్రమవర్మ మాట్లాడుతూ ఏపీఎస్పీఎఫ్‌లో రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. విజయవాడ, రాజమండ్రి, రాయలసీమ జోన్‌ల నుంచి 100 మంది ఏపీఎస్ఎఫ్ సిబ్బంది హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలలో ఎస్పీఎఫ్ ఐజీ బి.వి.రామిరెడ్డి, ఎస్పీఎఫ్ విజయవాడ జోన్ కమాండెంట్ ఎం.శంకర్రావు, అసిస్టెంట్ కమాండెంట్ కె.కృష్ణమూర్తి, కమాండెంట్ కెవీఎస్ గుప్త, అసిస్టెంట్ కమాండెంట్‌లు మల్లికార్జున్‌రావు, డి.శంకర్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో ఉపాధ్యాయుడు అరెస్టు

పిడుగురాళ్ల, జనవరి 19: బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఉపాధ్యాయుడు షేక్ ఆదాంషఫీవుల్లాను శుక్రవారం పిడుగురాళ్ల పోలీసులు అరెస్టు చేశారు. మైనర్‌పై జరిగిన ఘటనను దళిత సంఘాలు, ప్రజాసంఘాల నేతలు తీవ్రంగా ఖండిస్తూ నిందితుడిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి




భానుప్రకాష్ మృతదేహం

యడ్లపాడు, జనవరి 19: ముందు వెళుతున్న కారును వెనుక నుంచి ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పదహారో నంబరు జాతీయ రహదారిపై యడ్లపాడు వద్ద గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేపల్లెకు చెందిన సుఖవాసి భానుప్రకాష్(43), సాంబశివరావు, హేమంత్‌కుమార్, విజయవాడకు చెందిన శ్రీనాథ్‌లు విజయవాడ నుంచి తిమ్మాపురంలోని బంధువు ఇంటికి కారులో బయలుదేరారు. యడ్లపాడు ఎస్ఎస్ఎల్ వద్దకు రాగానే కారును వెనుక నుంచి ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. కారు వెనుక సీటులో కూర్చున్న భానుప్రకాష్, హేమకుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108వాహనంలో చిలకలూరిపేటలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో భానుప్రకాష్ మృతిచెందాడు. మృతునికి భార్య రాధిక, ఒక కుమార్తె ఉన్నారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

బాపట్లరూరల్, జనవరి 19: పురుగుల మందు తాగి యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాపట్లరూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని కొండుభొట్లవారిపాలెం గ్రామానికి చెందిన ఎస్.హేమంత్ (22) అనే యువకుడు తమ తల్లిదండ్రులను బైక్ కొనుక్కోవాలని డబ్బులు అడగగా వారు నిరాకరించటంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగాడు. వెంటనే ఆ యువకుడిని కుటుంబ సభ్యులు బాపట్ల ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చారు. మెరుగైన వైద్యం కోసం పొన్నూరు తరలించగా మార్గ మధ్యంలో యువకుడు మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



వేణుబాబు మృతదేహం

ప్రత్తిపాడు, జనవరి 19: స్కూలు బస్సు ఢీ కొని ద్విచక్ర వాహనదారుడు మరణించిన ఘటన ప్రత్తిపాడు మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెం వద్ద శుక్రవారం జరిగింది. ప్రత్తిపాడు పోలీసుల కథనం ప్రకారం బాపట్ల జిల్లా పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన వెల్లటూరి వేణుబాబు (38), గణేష్ మణికంఠారెడ్డిలు ద్విచక్రవాహనంపై గుంటూరు వైపు వెళుతున్నారు. అయితే తిక్కిరెడ్డిపాలెం వద్ద ముందు వెళుతున్న కారును ఓవర్‌టేక్ చేస్తుండగా గుంటూరు వైపు నుంచి వస్తున్న స్కూల్ బస్ వీరిని ఢీ కొంది. దీంతో ముందు ఉన్న వేణుబాబు అక్కడికక్కడే మరణించగా, వెనుక ఉన్న గణేష్‌మణికంఠారెడ్డికి కాళ్లు చేతులు విరిగి పోయాయి. వెంటనే ఇతన్ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ రవీంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు దిగుతూ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి మృతి



పాతూరి రవిచంద్ర (ఫైల్)

పిడుగురాళ్ల, జనవరి 19: రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి మృతి చెందిన ఘటన శుక్రవారం పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌లో జరిగింది. ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి పాతూరి రవిచంద్ర(33) కుటుంబం సంక్రాంతి పండుగకు పిడుగురాళ్ల వచ్చింది. వారికోసం రవిచంద్ర హైదరాబాద్ నుంచి పిడుగురాళ్ల వచ్చి రైలు దిగుతుండ గా జారిపడి తీవ్రగాయాలు అయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో రవిచంద్ర మృతి చెందాడు. మృతునికి భార్య, ఇరువురు పిల్లలు వున్నారు.

వైసీపీ హయాంలో దళితులకు అన్యాయమే



● మాజీ ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జనవరి 19: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక 6 వేల మందికి పైగా దళితులపై ముఖ్యమంత్రి దాడులు చేయించారని గురజాల మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 188 మంది దళితులను హత్యలు చేశారని, రోజు ఇద్దరు ముగ్గురు దళితులపై దాడులు, ఆరుగురిపై హత్యాయత్నాలు, వారానికి ముగ్గురు దళిత మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దళితులకు రాజ్యాంగ బద్ధంగా అందాల్సిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిన జగన్ ఏమి ఉద్ధరించాడని అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరణ చేస్తున్నాడన్నారు. కొవిడ్ సమయంలో మాస్క్ అడిగిన దళిత వైద్యుడు సుధాకర్‌ను దారుణంగా హత్యచేయడమే కాకుండా మరో దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన ఘనత వైసీపీ నేతలదేనన్నారు. టీడీపీ హయాంలో 4 లక్షల మంది దళిత సోదరులకు ఉపాధి కల్పించిన ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి విదేశీ విద్యను దూరం చేశారని అన్నారు. దళితులు ఆత్మగౌరవంతో సగర్వంగా బతికేందుకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ల్యాండ్ పర్చేజింగ్ స్కీమ్‌ను తీసుకొస్తే జగన్ ఆ పథకాన్ని రద్దు చేశాడన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా వున్న 50 వేల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకపోగా చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ అందుబాటులోకి తీసుకొస్తే జగన్ దానిని కూడా పక్కన పెట్టేశాడన్నారు. ఎస్సీ ఎస్టీ చెల్లెమ్మల వివాహానికి వైఎస్ఆర్ పెళ్లికానుక లక్ష రూపాయలు ఇస్తానని మేనిఫెస్టోలో చెప్పి ఒక్కరికి ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. కోడికత్తి డ్రామాలో దళితబిడ్డ శ్రీనివాసును, అయేషామీరా కేసులో సత్యంబాబును ఏళ్లతరబడి జైలుపాలు చేశారన్నారు. జంగారెడ్డిగూడెంలో జరిగిన కల్తీమద్యం మృతులలో 12 మంది దళితులు మృతిచెందారన్నారు. అక్రమ ఇసుక రవాణాను ప్రశ్నించిన వరప్రసాద్‌కు గుండుగీయించి మాస్క్ పెట్టుకోలేదని చీరాలకు చెందిన దళిత యువకుడు కిరణ్‌ను పోలీసులు కొట్టి చంపారని, మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న రామకృష్ణ సోదరుడు రామచంద్రపై దాడి చేయడమే కాకుండా పులివెందులలో దళిత మహిళ పై అత్యాచారం చేశారన్నారు. ఆర్థిక నేరగాళ్లు అంతా వైసీపీలోనే వున్నారని యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు.

దళిత ద్రోహి సీఎం జగన్

● మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



మాట్లాడుతున్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 19: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విదేశీ విద్య పథకానికి పేరు మార్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దళితులను అగౌరవపరిచారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో 125 వేల అడుగులకు తొక్కి 125 అడుగుల విగ్రహం పెడితే దళితులకు మీరు చేసిన పాపాలు పోతాయా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దళితులను గౌరవిస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరుపై విదేశీ విద్యను ప్రవేశపెట్టి 10 నుంచి 15 లక్షల మందికి పైగా విద్యార్థులకు విదేశీ విద్యను అందించడం జరిగిందన్నారు. నాలుగేళ్ల వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు జగన్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు విదేశాలకు పంపలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 6వేల మంది దళితులపై దాడికి పాల్పడి 180మంది దళితులను హతమార్చిన దళిత ద్రోహి జగన్ అని అన్నారు. దళితులపై ప్రేమ ఉంటే బ్లాక్ లాక్ పోస్టులు ఎందుకు భర్తీ చేయలేదని ఆయన ప్రశ్నించారు. దళితవాడలకు 200 యూనిట్ల లోపు కరెంటు చంద్రబాబునాయుడు ప్రకటిస్తే జగన్ ప్రభుత్వం ఉచిత కరెంటు ఎత్తేసి దళితుల ముక్కు పిండి బిల్లులు వసూలు చేశారన్నారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పెట్టినంత మాత్రాన నీవు చేసిన పాపాలు దళితులు మరచిపోరని, విగ్రహాన్ని ఆవిష్కరించే నైతిక హక్కు మీకు లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వార్థ రాజకీయాలతో పచ్చగా ఉన్న పల్లెల్లో గొడవలు పెట్టి ప్రజల మధ్య చిచ్చు రేపుతున్నారన్నారు. బొల్లా అవినీతిని ప్రశ్నించినవారిపై దాడులు, హత్యాయత్నాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో బ్రహ్మనాయుడు అహంకారానికి, అవినీతి, అక్రమాలకు ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో ఐఏఎస్ అకాడమి చైర్మన్ పారా లక్ష్మయ్య, డీఎల్‌డీఏ చైర్మన్ లగడపాటి వెంకట్రావు, నియోజకవర్గ పరిశీలకుడు మానుకొండ శివప్రసాద్, బచ్చు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ పేరు పలికే అర్హత జగన్‌కు లేదు

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

బెల్లంకొండ, జనవరి 19: రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ పేరును పలకటానికి కూడా ఈ రాష్ట్ర ముఖ్యమంత్రికి ఏ మాత్రం అర్హత లేద ని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మహోన్నతమైన వ్యక్తి బాబా సాహెబ్ అంబేద్కర్ అన్నారు. అలాంటి వ్యక్తి పేరుతో గతంలో తెలుగుదేశం పార్టీ అంబేద్కర్ విదేశీ విద్య అని పేరు పెడితే ప్రస్తుతం ఆ పేరును తొలగించి వైఎస్ విద్య అని పేరు పెట్టారని అన్నారు. అటువంటి వ్యక్తి మళ్ళీ అంబేద్కర్ పేరు చెప్పి విగ్రహావిష్కరణ అంటూ దళితుల ఓట్లను దండు కోవటం కోసం కుట్ర జరుగుతుం దన్నారు. నిజంగా ముఖ్యమంత్రికి అంబేద్కర్ పై ప్రేమ ఉంటే తక్షణమే వైఎస్ఆర్ విదేశీవిద్య పేరు మార్చి అంబేద్కర్ విదేశీ విద్యను పేరును కొనసా గించాలని డిమాండ్ చేశారు. అణగారిన వర్గాల కోసం గత ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్, ఎస్సీ కార్పొరేషన్ లోన్‌లను ప్రదేశ పెడితే ప్రస్తుత ప్రభుత్వం వాటిని రద్దు చేసి మోసం చేశారని విమర్శించారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి దళితుల పాలిట శాపంగా మారారని విమర్శించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119, 130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 80,758 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 90,534 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 41,325 టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఇలా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తెల్లకాయలు	5000	13000
334	9000	21000	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	19000	334	--	--
273	12000	16500	నెంబరు. 5	--	--
341	10000	19000	273	--	--
4884	11500	16000	341	14000	15200
సూపర్ 10	15000	15000	ఏసీ స్పెషల్ వెరైటీ		
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తేజ	16500	18500
తేజ	8000	20500	బ్యాడిగి	11000	18000
బ్యాడిగి	9000	19000	దేవనూరుడీలక్స్	--	--
దేవనూరుడీలక్స్	8000	20000	తెల్లకాయలు	6000	12500



బాబు ష్యూరిటీ హామీ పత్రాలు అందజేస్తున్న నసీర్, టీడీపీ నేతలు

టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

● టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్

గుంటూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ అన్నారు. 'భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని లాంచెస్టర్ రోడ్డు, వంగా వారి వీధిలో ఇంటింటికి తిరిగి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి సంక్షేమ పథకాల పేరు చెప్పి ప్రజలను మభ్యపెడుతూ అభివృద్ధి లేకుండా రాష్ట్రాన్ని 30 ఏళ్ల వెనక్కి నెట్టేసాడని విమర్శించారు. నవరత్నాలని చెప్పి ప్రజలను మోసం చేసిన జగన్‌రెడ్డి ప్రజల ప్రజల నుంచి దోపిడీచేసే విధంగా సంక్షేమ పథకాలను రూపొందించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రుల కలల రాజధాని అమరావతి కట్టడాలను నిలిపివేసి, రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశాడని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్నా, రాష్ట్ర నిర్మాణం జరగాలన్నా అది చంద్రబాబుతోనే సాధ్యమని, రాబోయే ఎన్నికలలో టీడీపీ- జనసేన పార్టీలని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చల్లా ఆంజనేయప్రసాద్, షేక్ ఖరీముల్లా, బత్తుల లక్ష్మణ్‌రావు, చిన్న బుజ్జి, చంద్రశేఖర్, జనసేన నేతు పసుపులేటి నరేష్ పాల్గొన్నారు

పశ్చిమలో ఓటర్లకు రజిని ప్రలోభాల ఎర

● టీడీపీ పశ్చిమ, బీసీ నాయకులు డాక్టర్ నిమ్మల శేషయ్య



నిమ్మల శేషయ్య

గుంటూరు,జనవరి 19(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజక వర్గంలో ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశ్యంతోవున్న మంత్రి విడదల రజిని అక్కడి ఓటర్ల ను ప్రలోభాలకు గురిచేస్తున్నారని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేత, బీసీ నాయకులు డాక్టర్ నిమ్మల శేషయ్య ఆరోపించారు. శుక్రవారం గుజ్జన గుండ్లలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చిలకలూరిపేటలో ప్రజాగ్రహానికి గురై గుంటూరు పశ్చిమకు వలసవచ్చిన మంత్రి విడదల రజిని వివిధ అక్రమాలు, డ్రామాలతో తన పబ్బం గడుపుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని, అందులో భాగమే పశ్చిమలో ఓటరుగా నమోదు కావడం, తన పార్టీ కార్యాలయంపై దాడి నాటకమని ఆరో పించారు. ఇప్పటికే పశ్చిమలో ఓటర్లకు బూటకపు హామీలు, వైసీపీ కార్పొరేటర్లకు నగదు ఎర చూపటం వంటి చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. మంత్రి రజిని ఎన్ని కుయుక్తులు పన్నినా పశ్చిమలో ఓటర్లను మభ్యపెట్టలేరని, నియోజకవర్గం బీసీలు టీడీపీకి ఓటు వేయడం ఖాయమని నిమ్మల శేషయ్య తేల్చి చెప్పారు.

కొడాలి నానికి మతి భ్రమించింది

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గుడివాడలో జరిగిన 'రా.. కదలిరా!' సభ విజయవంతం అవడంతో కొడాలి నానికి మతి భ్రమించి ఉచ్ఛనీచాలు మరిచి మాట్లాడుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, టీడీపీ కార్పొరేటర్లు విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబును వెన్నుపోటుదారుడని పదేపదే అంటున్న కొడాలి నాని, బాబు కాళ్లు పట్టుకుని ఎమ్మెల్యే టికెట్లు తెచ్చుకున్నప్పుడు ఆ సంగతి తెలియదా అని ప్రశ్నించారు. ప్రతిష్ఠాత్మకమైన ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయానికి ఎన్టీఆర్ పేరు తొలగించినప్పుడు కొడాలి నాని, వల్లభనేని వంశీ నోళ్లు ఎందుకు పడిపోయాయని వారు ప్రశ్నించారు. నానికి రోజులు దగ్గర పడ్డాయని, మరో మూడు నెలల్లో అంకుశం రామిరెడ్డికి పట్టిన గతే ఆయనకు పడుతుందని హెచ్చరించారు. సమావేశంలో కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాంప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, వేల్పూరి కిరణ్, పొదిలి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు. సిబ్బంది తదితరులు

దేశ ఆర్థిక ప్రగతిలో ఎల్ఐసీ పాత్ర కీలకం

● అరండల్‌పేట కార్యాలయం వద్ద జాతీయికరణ దినోత్సవం

గుంటూరు(తూర్పు), జనవరి19: దేశ ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషించడంతో పాటు, బీమా మార్కెట్లో తిరుగు లేని శక్తిగా ఎల్ఐసీ ఎదిగిందని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్, మచిలీ పట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వీవీకే సురేష్ తెలిపారు. శుక్ర వారం అరండల్‌పేట, ఎల్ఐసీ కార్యాలయంవద్ద ఎల్ఐసీ జాతీయికరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 సంవత్సరాల నుంచి 25 బీమా కంపెనీలతో వ్యాపార పోటీలోవున్న ఎల్ఐసీ నేడు రూ45.4లక్షల కోట్ల ఆస్తులతో దేశంలోనే అత్యున్నత ఆర్థికశక్తిగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు 'అన్ని సవాళ్లను అధిగమించి ఎల్ఐసీ కాపాడుకుంటాం' అని ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు జే.రాజేంద్ర ప్రసాదు, జీ. శివరామకృష్ణారావు, ఐ.వెంకట్రావు, డీ.సైదులు, ఎన్.సుధారాణి, సీహెచ్ మధుబాల, ఏ.ఉషాబాల, పీ.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆచార్య హేమచంద్రారెడ్డి తదితరులు

ఒత్తిడి లేని విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

● ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి

గుంటూరు(విద్య),జనవరి 19:పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించి వారి భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దాలని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి సూచించారు. ఉన్నత విద్యా విభాగం, మెల్‌బోర్న్ యూనివర్సిటీ సంయుక్తంగా చేపట్టిన కెరీర్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టులో ఉపాధ్యాయులు, అధ్యాపకులకు గోరంట్లలోని ఓ ప్రైవేటు స్కూల్లో శుక్రవారం శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆచార్య హేమచంద్రారెడ్డి మాట్లాడారు. జిల్లాలో ఎంపిక చేసిన 20. పాఠశాలలు, 1 ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజిల్లోని' 86 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అవకాశాలు అందిపుచ్చుకునే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు విద్యార్థులకు భవిష్యత్తు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ కృషి చేస్తుందని ఛైర్మన్ హేమచంద్రారెడ్డి తెలిపారు. ఆచార్య దేవకుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఈశిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు మంచి కెరీర్ ఎంచుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష రాష్ట్ర అధికారి టీ. విజయ భాస్కర్, డీఈవో పీ.శైలజ, ఎస్ఎస్ఏ ఏపీసీ జీ.విజయలక్ష్మి, ఆడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు జగనే అనర్హుడు

● దళితులపై 6 వేలకు పైగా దాడులు.. 188 మంది హత్య..

● తన ప్రచార పిచ్చి కోసమే విజయవాడకు స్మృతివనం మార్పు

● టీడీపీ గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న నాని, శేషయ్య, టీడీపీ నేతలు

గుంటూరు, జనవరి19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితులపై దమనకాండసాగిస్తున్న జగన్‌రెడ్డికి అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదని టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర(నానీ) ఆగ్రహం వ్యక్తంచేసారు. గుంటూరు లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఆయన దళిత నేతలతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. జగన్‌పాలనలో దళితులపై జరిగిన దాడుల చిత్రాలను ప్రదర్శిస్తూ, ప్లకార్డులు చేతబూని ప్రదర్శనగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్లలో దళితులపై 6వేలకు పైగా దాడులు జరిగాయని, 188 మంది దళితుల్ని హత్య చేసారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధంగా దళితులకు అమలుకావాల్సిన 27 సంక్షేమ పథకాలను, ఎస్సీ కార్పొరేషన్‌ను సీఎం జగన్‌రెడ్డి రద్దుచేశారని మండిపడ్డారు. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటులో అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయని, తాము అధికారంలోకి రాగానే దానిపై విచారణ జరిపిస్తామని హెచ్చరించారు. ఐదేళ్లుగా జైలులో మగ్గుతున్న కోడికత్తి కేసు నిందితుడు జనిపల్లి శ్రీను విషయంలో జగన్‌రెడ్డి కోర్టుకు వచ్చి వాంగ్మూలం ఇస్తే బెయిల్ ఇస్తామని కోర్టుచెప్పినా ఆయనకు కోర్టుకు వెళ్లే తీరిక లేకపోవటం అమానుషమన్నారు. కార్యక్రమంలో పరిశీలకుడు సింహాద్రి కనకాచారి, నిమ్మల శేషయ్య, సుఖవాసి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు దర్శనపు యాకోబు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ పార్లమెంట్ అధ్యక్షుడు కారంగి అనిల్‌కుమార్, సుధీర్, మన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

దళితులను అణగతొక్కడమే జగన్ లక్ష్యం : మన్నవ మోహనకృష్ణ

అంబేద్కర్‌ను ఆకాశానికి ఎత్తి, దళితులను పాతాళానికి తొక్కడమే సీఎం జగన్‌రెడ్డి నైజమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నా ఎస్సీ, నా ఎస్టీ..' అంటూ పదేపదే ఊదరగొట్టే జగన్‌రెడ్డి ఆయన పాలనలో దళితులపై జరుగుతున్న దమనకాండకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఐదేళ్ల వైసీపీపాలనలో దళితులుపై 11వేలకు పైగా దాడులు, దాదాపు 300 మంది హత్య ఘటనలు జరిగామని ఎన్‌సీఆర్‌బీ ఇచ్చిన నివేదికకు ఏం సమాధానం చెబుతారంటూ నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే అంబేద్కర్ విగ్రహం పేరుతో రాజకీయం మొదలుపెట్టారని మన్నవ మండిపడ్డారు.

షోకాజ్ నోటీసుల్లో అన్నీ అవాస్తవాలే..

● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు, హెల్పర్లు

● కలెక్టరేట్ ఎదుట 39వ రోజున కొనసాగిన సమ్మె

● సీడీపీవో కార్యాలయం ఎదుట నిరసన

గుంటూరు(తూర్పు), జనవరి19: ప్రభుత్వ విధులను, బాధ్యతలను విస్మరించి ఉద్యోగ విధులను నిర్వర్తించలేదని షోకాజ్ నోటీసుల్లో పేర్కొనడంపై అంగన్‌వాడీల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాలు పెంచుతామని ఎన్నికల ప్రణాళికలోచేర్చి ఆపై అమలుచేయకపోవడం వలనే తాము సమ్మె చేయాల్సివచ్చిందన్న విషయం మీకు తెలియదా? అంటూ ప్రశ్నించారు. అంగన్‌వాడీలు, హెల్పర్లు స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 39వ రోజుకు చేరుకుంది. నిరసనల్లో భాగంగా ప్రభుత్వం జారీచేసిన షోకాజ్ నోటీసులను ప్రదర్శిస్తూ చుట్టుగుంట సెంటరు నుంచి ర్యాలీ, సీడీపీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడే బైఠాయించి ఆందోళన చేపట్టారు. అనంతరం యూనియన్ జిల్లా నాయకులు దీప్తి మనోజ, రాధాలు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేస్తే వెంటనే సమ్మెను విరమిస్తామని, హామీలు అమలు చేయడం తప్ప ప్రభుత్వానికి మరో మార్గం లేదని స్పష్టం చేశారు. నిరసనల్లో అంగన్‌వాడీలు, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.



సీడీపీవో కార్యాలయం ఎదుట షోకాజ్ నోటీసులను ప్రదర్శిస్తూ నిరసన..

అంగన్‌వాడీలకు మద్దతుగా సంతకాల సేకరణ

అంగన్‌వాడీల చేపట్టిన నిరవధిక సమ్మెకు మద్దతు తెలుపుతూ శుక్రవారం శంకర్‌విలాస్ సెంటర్ వద్ద ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభుదాస్, ఎల్ఐసీ మహిళా ఉద్యోగుల సమన్వయ కమిటీ కో కన్వీనర్ ఎస్ సుధారాణి, ఉద్యోగ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



యార్డులో ఎర్రగీత దాటి దిగుమతి చేసిన మిర్చి టిక్కీలు

నిబంధనలకు నీళ్లు..

● వేలం సరుకు బయటకు తరలించడానికి ఇబ్బందులు

● మైకులో ప్రకటనచేస్తున్నా తీరు మార్చుకోని వ్యాపారస్తులు

● టిక్కీలు రెండు, మూడు రోజులు ఎండలోనే..

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో దిగుమతి వ్యాపారస్తులు నిబంధనలు పాటించడం లేదు. వాళ్లకు కేటాయించిన వేలం షెడ్లుదాటి రోడ్డుపై మిర్చి టిక్కీలను దిగుమతి చేసుకొంటూ ట్రాఫిక్‌కి ఆటంకం కలిగిస్తున్నారు. ఈ విషయంపై మార్కెటింగ్ అధికారులు ఎన్నిసార్లు ఆదేశాలు జారీచేస్తున్నా దిగుమతిదారులు పెడచెవిన పెడుతున్నారు. దీనివలన ఎగుమతిదారులు కొనుగోలు చేసిన మిర్చి టిక్కీలు సకాలంలో బయటకు వెళ్లడం లేదు. దాని వలన మిర్చితూకం తగ్గిపోవడం, ఎక్స్‌పోర్టులు ఆలస్యంకావడం వంటివి జరుగుతున్నాయి. అలానే మిర్చి టిక్కీలు ఒక లాట్‌లోవి మరొక లాట్‌లోకి పొరపాటున హమాలీలు చేరుస్తుండంతో కొత్త చిక్కులు ఎదురౌతున్నాయి. ఈ విషయంలో మైకు ద్వారా పదేపదే ప్రకటన చేయిస్తున్నా అవి అరణ్యరోదనగానే మారుతున్నాయి.

2024 మిర్చి సీజన్ గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఇప్పటికే ప్రారంభమైంది. రోజుకు లక్షకు పైగా మిర్చి టిక్కీలను రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. దీంతో యార్డు ప్రాంగణం రద్దీగా మారింది. ఈ పరిస్థితుల్లో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సక్రమంగా జరగకపోతే అనేక సమస్యలు తలెత్తుతాయి. ప్రతీ ఒక్క కమిషన్ వ్యాపారికి భారీ షెడ్లు కేటాయించారు. అలానే వారి షాపుల ఎదురు రెడ్ మార్కింగ్ చేశారు. ఆ గీత దాటొద్దని మార్కెట్ కమిటీ స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. అయినప్పటికీ యార్డులో పలువురు దిగుమతి దారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. షాపుల ఎదులే లాట్లకు లాట్లు మిర్చి టిక్కీలు అన్‌లోడింగ్ చేయిస్తున్నారు.

రోజుకు 60 వేలకు టిక్కీలకు పైనే వాణిజ్యం..

ప్రస్తుతం యార్డులో రోజుకు 60వేల నుంచి 70వేల టిక్కీల మధ్యన వాణిజ్యం జరుగుతుం ది. కొనుగోలు జరిగినవి అదేరోజు సాయంత్రం 4 గంటల లోపు మిర్చి యార్డు వెలుపలికి వెళ్లిపోతేనే అంతా సవ్యంగా ఉంటుంది. లేకుంటే ఆ రోజు సాయంత్రం రైతులు మిర్చియార్డుకి తీసుకొచ్చే సరుకుని అన్ లోడింగ్ చేయడానికి వీలుపడదు.

రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ చైతన్య సదస్సులు

గుంటూరు(తూర్పు), జనవరి19: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి మాదిగల రాజకీయ చైతన్యసదస్సులు నిర్వహిస్తున్నట్టు స్వర్ణాంధ్రా ఏమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసు బాబు మాదిగ అన్నారు. గోరంట్ల సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 23న ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి పర్యటన ప్రారంభమవుతుందని, ఇందులో భాగంగా అన్ని ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. మార్చి 16తో పర్యటన ముగుస్తుందని, ముగింపు సదస్సును గుంటూరులో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్రా ఏమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, ఇన్‌చార్జీలు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



మాయాబజార్ నాటకంలోని సన్నివేశం

ఆకట్టుకున్న మాయాబజార్ నాటకం

గుంటూరు(తూర్పు), జనవరి19: స్థానిక బృందావనగార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కేఆర్కే ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కళాపరిషత్ నిర్వహణలో 19వ నాటకోత్సవాల సందర్భంగా ముడోవరోజు శుక్రవారం ప్రదర్శించిన 'మాయా బజారు' పద్యనాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయకమిటి ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వర రావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీసాయి సంతోషి నాట్యమండలి (సురభి) వారు సురభి సంతోష్ నిర్వహణలో పద్యనాటకాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమాన్ని సంస్థ నిర్వాహకులు రామకృష్ణప్రసాద్ కాట్రగడ్డ పర్యవేక్షించారు.

రిపబ్లిక్‌డే పరేడ్‌కు విజ్ఞాన్స్ ఎన్‌సీసీ విద్యార్థిని



నాగ సంహిత చౌదరి

గుంటూరు (విద్య), జనవరి 19: వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయో ఇన్ఫర్మాటిక్స్ సెకండియర్ విద్యార్థిని నాగ సంహిత చౌదరి అనే విద్యార్థిని ఈ నెల 26న న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎన్‌సీసీ విభాగంలో ఎంపికయిందని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిపబ్లిక్ డే ప్రోగ్రాం లోని కర్తవ్యపాత్ విభాగంలో నాగ సంహితచౌదరి పాల్గొంటుందని వెల్లడించారు. ఈ సందర్భంగా నాగసంహితచౌదరిను విజ్ఞాన్స్ విద్యా సంస్థల ఛైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘు నాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, ఎన్‌సీసీ సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

జాతికి పట్టిన చీడపురుగులు జగన్, మోదీ

●సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, పక్కన జంగాల తదితరులు

గుంటూరు(తూర్పు), జనవరి19: ప్రధాని మోదీ, సీఎం జగన్‌రెడ్డిలు భారతజాతికి పట్టిన చీడ పురుగులని, రానున్న ఎన్నికలలో వారిని ఇంటికి పంపితేనే దేశ, రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొత్తపేట, మల్లయ్యలింగంభవన్‌లోని వీఎస్‌కే హాలులో సీపీఐ నగర జనరల్‌బాడీ సమావేశాన్ని ఆ పార్టీ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముప్పాళ్ల మాట్లాడుతూ ఈనెల 22న తలపెట్టిన అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవాన్ని ఆసరాగా చేసుకుని రానున్న ఎన్నికలలో ఓట్లు దండుకునేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు మోదీకి పుత్ర సమానుడైన సీఎం జగన్ మోదీ మద్దతుతో అప్పుల మీద అప్పులు తెచ్చి సుమారు రూ.11 లక్షల కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపారని విమర్శించారు. దళితులు, మైనారిటీలపై దాడులు, మహిళలపై అత్యాచారాల్లో ఏపీని దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిపి, రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కిన సీఎం జగన్ విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం దారుణమని అన్నారు. కేంద్రంలో మోదీని, రాష్ట్రంలో జగన్‌ను ఓడించేందుకు కలిసి వచ్చేపార్టీలను కలుపుకుని ముందుకు వెళ్తామన్నారు. సమావేశంలో జంగాల అజయ్‌కుమార్, ఎస్.మంగా శ్రీనివాస్, అంజిబాబు, సీహెచ్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మండలి సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, అధికారులు

ప్రతి గ్రామానికి పశు అంబులెన్స్‌లు

● వ్యవసాయ సలహామండలి సమావేశంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరుసిటీ, జనవరి 19: జిల్లాలోని పశు అంబులెన్స్‌లు ప్రతి గ్రామాన్ని సందర్శించి పశుపోషణ, వ్యాక్సినేషన్, వ్యాధుల నివారణపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేలా పశుసంవర్ధక శాఖ అధికారులు షెడ్యూల్ రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశమందిరంలో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన పశు అంబులెన్స్ లు ఫిబ్రవరి నెలలో గ్రామాలను సందర్శించే తేదీల షెడ్యూల్ వెంటనే అందించాలని, ప్రతి ఆర్బీకేలోను అంబులెన్స్ గ్రామానికివచ్చే తేదీ వివరాలను రైతులకు తెలియచేయాలన్నారు. రబీ ఈ క్రాప్ బుకింగ్‌ను ఫిబ్రవరి 15 నాటికి పూర్తి చేసి 28 వరకు సోషల్ ఆడిట్ నిమిత్తం వివరాలను ఆర్బీకేలలో ప్రదర్శించాలని, మార్చి 4 లోపు అభ్యంతరాలను పరిష్కరించి తుది జాబితాను మార్చి 6 నాటికి ప్రచురించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లాకు సంబంధించి నాబార్డు పొటన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారుల నూతన సంవత్సర క్యాలెండరు, డైరీలను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖ అధికారి రవీందర్, ఏపీఎంఐపీ పీడీ వజ్రశ్రీ, ఇరిగేషన్ ఎస్ఈ ఉమా మహేశ్వరరావు, ఏపీసీఎన్ఎఫ్ పీడీ రాజకుమారి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు లక్ష్మీ, లీడ్‌బ్యాంక్ మేనేజరు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28 నాటికి కులగణన పూర్తి చేయాలి

● నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు (కార్పొరేషన్), జనవరి 19 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుల గణనను పొరపాట్లు లేకుండా పగడ్బందీగా ఈనెల 28నాటికి పూర్తిచేయాలని నగర కమిషనర్ కీర్తిచేకూరి వార్డు సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులను ఆదేశించారు. గుంటూరు నగరంలో శుక్రవారం నుండి ప్రారంభమైన కుల గణనపై కమిషనర్ సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణన చేపట్టాలని ప్రభుత్వం ఈనెల 19 నుండి 28 వరకు షెడ్యుల్ ఇచ్చిందని, అందుకు తగిన విధంగా నగరంలో కూడా కుల గణన నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయడానికి సచివాలయం వారిగా కార్యాచరణ సిద్ధం చేయాలని నోడల్ అధికారులను ఆదేశించారు. వలంటీర్లు అందరూ సర్వేలో విధిగా పాల్గొనాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై చర్యలు తప్పవని స్పష్టంచేశారు. సర్వేలో సేకరించిన ప్రజల సమాచారం గోప్యంగా ఉంచాలన్నారు. ప్రస్తుతం సర్వే జరిగే కాలంలో ఎవరైనా ప్రజలు అందుబాటులో లేకుంటే వారు 28 తర్వాత తమ వార్డు సచివాలయంలో నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రజలు కూడా తమ ఇంటి వద్దకు వచ్చే వలంటీర్లకు తగిన సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు.

అక్రమ బయో స్టిమ్యులెంట్స్‌పై ఉక్కుపాదం

● జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు

గుంటూరు సిటీ, జనవరి 19: జిల్లాలో అనుమతులు లేని బయో స్టీమ్యులెంట్స్ తయారీదారులపై ఉక్కుపాదం మోపుతున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' లో 'పంటల పై విషం' అనే శీర్షిక తో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. జీ-2, జీ-3 అనుమతి పత్రాలు లేని బయో స్టిములెంట్స్ అమ్మకాలు జిల్లా లో పూర్తిగా నిలుపుదల చేసినట్టు తెలిపారు. గత సంవత్సర కాలంగా వ్యవసాయ అధికారులు గుంటూరు అర్బన్ పరిధిలో బయో తయారీదారుల గోడౌన్‌లపై ఆకస్మిక దాడులు నిర్వహించి సుమారు వంద రకాల పేర్లు గల బయో స్టీమ్యులెంట్స్ 15వేల లీటర్లు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. వాటి విలువ సుమారు రూ.కోటి వరకు ఉంటుందని పేర్కొన్నారు. గుంటూరు అర్బన్ పరిధిలోని వివిధ ట్రాన్స్‌పోర్టు, పార్సిల్ కార్యాలయాలపై విస్తృత తనిఖీలు నిర్వహించి 3838 లీటర్ల బయోమందులు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.82 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ తనిఖీల్లో 12 మందిపై ఛీటింగ్ కేసులు నమోదు చేయించామన్నారు. స్వాధీనం చేసుకున్న స్టాకు నుంచి నమూనాలను సేకరించి పరీక్ష నిమిత్తం పంపించడం జరిగిందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా తనిఖీలు ముమ్మరం చేసి అనుమతులులేని బయోస్టీములెంట్స్ తయారీదారులపై ఉక్కుపాదం మోపుతున్నా మన్నామని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు.



కరసేవకుడు చంద్రశేఖర్ శర్మను సన్మానిస్తున్న శివస్వామిజీ

అయోధ్య కరసేవకులకు సన్మానం

గుంటూరు సిటీ,జనవరి 19: ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి అయోధ్య వెళ్లిన కరసేవకులు మాగంటి చంద్రశేఖర్‌శర్మ, బద్రీనాథ్‌లను తాళ్ళయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివస్వామీజీ మాట్లాడుతూ.. ఈనెల 22 ఆయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవమునకు తనకూ ఆహ్వానం అందిందన్నారు. 1990-92 వ సంవత్సరంలో గుంటూరు నుంచి అయోధ్యకు మాగంటి చంద్రశేఖర్ శర్మ వెళ్లారని, అలాగే ఎంతోమంది ఎన్నో వ్యయ ప్రయాసలు కోర్చి అయోధ్యకు వెళ్లారని గుర్తు చేశారు. వాళ్ళందరి త్యాగ ఫలమే ఈరోజున అయోధ్యలో రామమందిరం నిర్మాణం అని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కల్లగంటి నాగార్జున, జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర కుమార్, పార్లమెంట్ కన్వీనర్ భీమినేని చంద్రశేఖర్, చరక కుమార్ గౌడ్, సాయిపవన్, మల్లేశ్వరరావు, మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ద్రోహి సీఎం జగన్ రెడ్డి

● టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్

గుంటూరు, జనవరి 19: నాలుగు సంవత్సరాల ఎనిమిది నెలల వైసీపీ పాలనలో ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.5 వేల కోట్లు దారి మళ్ళించిన సీఎం జగన్‌రెడ్డి గిరిజన ద్రోహి అని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గిరిజనులకు రావాల్సిన నిధులు గిరిజనులకు ఖర్చు పెట్టకుండా ఇతర ప్రభుత్వ పథకాలకు దారి మళ్లించారన్నారు. 16 గిరిజన సంక్షేమ పథకాలు రద్దుచేసి గిరిజనులపై ఈ ప్రభుత్వం కక్ష సాధిస్తోందని, ఎస్టీ కుటుంబాలను రోడ్డును పడేసిందన్నారు. అదేవిధంగా గిరిజనులను విద్యకు దూరం చేశారన్నారు. ఉన్నత ఉద్యోగాల శిక్షణ కోసం తీసుకొచ్చిన ఎన్టీఆర్ అభ్యున్నతి పథకం రద్దు చేశారన్నారు. నైపుణ్య శిక్షణాభివృద్ధి రద్దు, గిరిపుత్రిక కల్యాణ పథకం రద్దు, 60 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులతో ఇచ్చే ట్రైకార్ రుణాల రద్దు, ఇంకా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను కూడా దారిమళ్ళించారు. గిరిజనుల అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వం ఎన్నికలు దగ్గర పడుతుండటంతో గిరిజనులకు మాయమాటలు చెప్పి మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తుందన్నారు. వైసీపీ నేతలకు నేడు ఓడిపోతామనే భయం పట్టుకుందన్నారు. 230 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అని చెప్పి ఇప్పుడు బిల్లు కట్టమంటున్నారన్నారు. గిరిజన తండాలలో రోడ్లు అధ్వానంగావున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. నేడు ఎస్టీ కార్పొరేషన్ నిర్వీర్యమపోతుందని, ఎస్టీ కార్పొరేషన్ డీఆర్డీఏలో కలపాలనే దుర్మార్గపు ఆలోచనతో ఈ ప్రభుత్వం ఉందని, ఈచర్యలు విరమించుకోవాలన్నారు. ఈ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని ధారునాయక్ స్పష్టంచేశారు.

ఏఎంఈ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్



ఏవియేషన్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన 'ఏఎంఈ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(ఏఎంఈ సీఈఈ)2024' నోటిఫికేషన్ వెలువడింది. ఇది జాతీయ స్థాయి పరీక్ష. ఇందులో అర్హత పొందిన అభ్యర్థులకు లైసెన్స్ ప్రోగ్రామ్‌లు, నాలుగేళ్ల ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లు, మూడేళ్ల గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌లు, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లకు వరసగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ), ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ), యూజీసీ, స్కిల్ ఇండియా గుర్తింపులు ఉన్నాయి. అడ్మిషన్ పొందిన అభ్యర్థులందరికీ నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్‌లు అందిస్తారు.

ప్రోగ్రామ్‌ల వివరాలు

- **లైసెన్స్ ప్రోగ్రామ్‌లు:** ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్(డీజీసీఏ/ఈఏఎస్ఏ), కమర్షియల్ పైలెట్ లైసెన్స్
- **ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లు:** ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్, ఏరోనాటికల్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్
- **గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌లు:** బీబీఏ(ఏవియేషన్), బీఎస్సీ(ఏఎంఈ)
- **సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు:** క్యాబిన్ క్రూ, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, ఎయిర్‌పోర్ట్ గ్రౌండ్ స్టాఫ్

అర్హత: లైసెన్స్ ప్రోగ్రామ్‌లు, ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లకు గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

- గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌లలో బీబీఏ(ఏవియేషన్)కు ఆర్ట్స్/కామర్స్/సైన్స్ గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఏఎంఈ) ప్రోగ్రామ్‌నకు సైన్స్ గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి పూర్తిచేసి ఉండాలి.
- సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లకు ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణత చాలు.
- ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు అడ్మిషన్ నాటికి 16 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.

ఏఎంఈ సీఈఈ 2024 వివరాలు: దీనిని ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. పరీక్ష సమయం గంట. ఇంటర్/తత్సమాన అర్హత ఉన్న అభ్యర్థులకు మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు ఇస్తారు. డిప్లొమా పూర్తిచేసినవారికి జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లీష్, ఆప్టిట్యూడ్ నుంచి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు నాలుగు మార్కులు చొప్పున మొత్తం మార్కులు 300. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ప్రశ్నపత్రాన్ని ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో ఇస్తారు. ఎగ్జామ్ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

స్కాలర్‌షిప్ వివరాలు: ఏఎంఈ సీఈఈ 2024 ఎగ్జామ్‌లో మొదటి మూడు ర్యాంకులు సాధించిన వారికి, సెంట్రల్/స్టేట్ బోర్డు ఎగ్జామ్ (ఇంటర్ స్థాయి పరీక్ష)లో టాపర్స్‌గా నిలిచిన పదిమందికి స్కాలర్‌షిప్ కింద మొదటి సెమిస్టర్ ట్యూషన్ ఫీజు చెల్లిస్తారు. ఏఎంఈ సీఈఈ 2024 ఎగ్జామ్‌లో 4 నుంచి 15 ర్యాంకుల మధ్య సాధించిన 12 మందికి 75 శాతం; 16 నుంచి 50 మధ్య ర్యాంకులు సాధించిన 35 మందికి 50 శాతం; 51 నుంచి 200 మధ్య ర్యాంకులు సాధించిన 150 మందికి 25 శాతం; 201 నుంచి 1,000 మధ్య ర్యాంకులు సాధించిన 800 మందికి 20 శాతం; 1001 నుంచి 5,000 మధ్య ర్యాంకులు సాధించిన 4,000 మందికి 15 శాతం; ఏఎంఈ సీఈఈ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులందరికీ 10 శాతం చొప్పున మొదటి సెమిస్టర్ ట్యూషన్ ఫీజు చెల్లిస్తారు.

ఉద్యోగావకాశాలు: ఏఎంఈ ప్రోగ్రామ్‌లు పూర్తి చేసిన అభ్యర్థులు ఏరోనాటికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఎయిర్‌పోర్ట్ అండ్ ఎయిర్‌లైన్ మేనేజ్‌మెంట్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, క్యాబిన్ క్రూ, ఏవియేషన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఏవియేషన్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ విభాగాల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చు. ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీర్లు, ఏవియేషన్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ డిస్పాచర్, ఏవియేషన్ సెక్యూరిటీగా పనిచేయవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** www.amecee.in

దిక్సూచి DIKSUCHI

ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీలో

పీజీ, పీహెచ్‌డీ

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ(ఏపీఎఫ్‌యూ) - 2023-24 అకడమిక్ ఇయర్‌కు సంబంధించి మాస్టర్ ఆఫ్ ఫిషరీ సైన్స్(ఎంఎఫ్ఎస్సీ), పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. నెల్లూరు జిల్లా ముత్తుకూరులోని కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్సెస్‌లో అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్ల వివరాలు: ఎంఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లో ఆక్వాకల్చర్ 3, ఆక్వాటిక్ యానిమల్ హెల్త్ మేనేజ్‌మెంట్ 2, ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ 4, ఆక్వాటిక్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ 2, ఫిష్ ప్రాసెసింగ్ టెక్నాలజీ 3, ఫిషరీస్ ఇంజనీరింగ్ 2 సీట్లు చొప్పున మొత్తం 16 సీట్లు ఉన్నాయి. పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ఆక్వాకల్చర్ 2 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: ఎంఎఫ్ఎస్సీలో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి నాలుగేళ్ల బీఎఫ్ఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. దరఖాస్తు నాటికి అభ్యర్థుల వయసు 40 ఏళ్లు మించకూడదు. పీహెచ్‌డీలో ప్రవేశానికి ఎంఎఫ్ఎస్సీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 50 ఏళ్లు మించకూడదు. రెండు ప్రోగ్రామ్‌లకు జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 20
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ, అయిదో అంతస్తు, విశాల్ రెసిడెన్సీ, పద్మజ నగర్, తాడిగడప, విజయవాడ-521134
- **వెబ్‌సైట్:** www.apfu.ap.gov.in

బుక్ మై షోకు ఫిర్యాదు చేశాం



నాగవంశీ

'కొంతమంది కావాలనే బుక్ మైషోలో నకిలీ రివ్యూలు ఇచ్చి, 'గుంటూరు కారం' సినిమాను దెబ్బతీయాలని చూశారు. దానిపై ఆ సంస్థకు ఫిర్యాదు చేశాం. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'గుంటూరు కారం' విజయాన్ని అడ్డుకోవాలని కొందరు మొదటి రోజు నుంచే 'సినిమా బాగోలేద'ని సోషల్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేశారు. కానీ వారి ప్రయత్నాలు ఫలించలేదని చెప్పడానికి మా సినిమాకు వస్తున్న వసూళ్లే నిదర్శనం. ఆ విషయం చెప్పడానికే మీడియా ముందుకొచ్చాను' అని నిర్మాత నాగవంశీ అన్నారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. తొలి వారాంతానికే రూ. 200 కోట్ల వసూళ్లను సాధించి బాక్సాఫీసు దగ్గర నిలకడగా కొనసాగుతోందని. నాగవంశీ మీడియాతో ఆనందం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

- మహేశ్‌బాబు మొదట్నుంచి ఈ సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నారు. నెగెటివ్ రివ్యూలు వచ్చినా ఆయన ఆందోళన చెందలేదు. 'రేపటి నుంచి 'గుంటూరు కారం' వసూళ్లు ఎలా ఉంటాయో చూడండి' అన్నారు. ఆయన అంచనాలే నిజమయ్యాయి. మహేశ్ ధైర్యమే ఈ స్థాయి వసూళ్లకు కారణమైందనుకుంటున్నాను.
- 'గుంటూరుకారం' సినిమా కొంతమంది మీడియా వాళ్లకు లక్ష్యంగా మారింది. డిస్ట్రిబ్యూటర్లకు, థియేటర్లకు ఫోన్ చేసి మరీ వసూళ్ల గురించి ఆరా తీస్తున్నారు. వాళ్లు ఎన్ని విధాలా ప్రయత్నించినా, నెగెటివ్ రివ్యూలు ఇచ్చినా సినిమా ఫలితాన్ని దెబ్బతీయలేకపోయారు. రిలీజైన తొలి రోజే సోషల్ మీడియా ద్వారా సినిమా బాగోలేదనే ప్రచారాన్ని మొదలుపెట్టారు. కానీ సినిమా బాగుండడంతో ప్రేక్షకులు వాటన్నింటినీ పక్కనపెట్టి అఖండ విజయాన్ని అందించారు. కుటుంబ ప్రేక్షకులకు మా సినిమా బాగా నచ్చడం వల్లే ఈ స్థాయి వసూళ్లు వస్తున్నాయి. గతంలో మా బేనర్‌లో వచ్చిన చిత్రాలకు నెగెటివ్ రివ్యూ వచ్చినప్పుడు వసూళ్లు పడిపోయాయి. కానీ ఈ సారి మాత్రం వాటితో సంబంధం లేకుండా 'గుంటూరు కారం' భారీ వసూళ్ల దిశగా సాగుతోంది. కొందరు కావాలనే మా సినిమాను టార్గెట్ చేశారనే అభిప్రాయం ఉంది.
- దీనిని ఫ్యామిలీ సినిమాగా ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లి ఉండాల్సింది. ఇది త్రివిక్రమ్ శైలిలో ఉండే ఫ్యామిలీ సినిమా అని ప్రేక్షకులకు ముందే తెలియజెప్పలేకపోయాం. దీనివల్ల 'గుంటూరు కారం' పక్కా మాస్ ఫిల్మ్ అని అభిమానులు అనుకున్నారు. అందువల్ల మొదట్లో కొంత నిరాశ చెందినా సర్దుకున్నారు.

ఫిల్మ్ ఛాంబర్ మాట నిలబెట్టుకోవాలి

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ

సంక్రాంతి సినిమా వార్ ముగిసింది అనుకునేలోపే రాబోతున్న ఫిబ్రవరి వార్‌కి సంబంధించిన సెగలు అప్పుడే మొదలయ్యాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారు ఫిల్మ్‌ఛాంబర్‌కి రాసిన లేఖ.. వార్ మొదలవ్వకముందే వాతావరణం వేడెక్కేలా చేసిందని చెప్పాలి. నిజానికి పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన రవితేజ 'ఈగల్' సినిమా సంక్రాంతికి విడుదలకావాల్సింది. కానీ అప్పటికే నాలుగు సినిమాలు పోటీలో ఉండటం, తద్వారా తలెత్తే థియేటర్ల కొరత.. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని 'ఈగల్'ని ఫిబ్రవరికి వాయిదా వేసుకోవలసిందిగా ఛాంబర్ కోరింది. ఫిబ్రవరిలో సోలో డేట్ వచ్చేలా చూస్తామని ఫిల్మ్‌ఛాంబర్ మాటివ్వడంతో.. పీపుల్‌మీడియా సంస్థ 'ఈగల్'ని ఫిబ్రవరి 9కి వాయిదా వేసింది. ఇదిలావుంటే.. ఇప్పుడు అదే తేదీకి రజనీకాంత్ 'లాల్ సలామ్', సందీప్‌కిషన్ 'ఊరి పేరు భైరవకోన' చిత్రాలు విడుదల కానున్నాయి. ఈ విషయాన్ని సదరు చిత్రాల నిర్మాతలు ప్రకటించారు కూడా. ఈ నేపథ్యంలో 'సోలో డేట్ ఇస్తాం' అని మాటిచ్చిన ఛాంబర్, తన మాటను నిలబెట్టుకోవాలని, తమకు సోలో డేట్ వచ్చేలా సహకరించాలని కోరుతూ ఫిల్మ్‌ఛాంబర్‌కి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ లేఖ రాసింది. మరి ఈ విషయంపై ఛాంబర్ ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి. ఇక 'ఈగల్' విషయానికొస్తే రవితేజ కథానాయకుడిగా రూపొందిన ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. అనుపమా పరమేశ్వరన్, కావ్య థాపర్ కథానాయికలు.



బాధపెట్టాం... క్షమించండి

నయనతార

నయనతార 'అన్నపూరణి' వివాదం ఇంకా సద్దుమణగలేదు. కథ రీత్యా ఇందులోని కొన్ని సన్నివేశాలు మత విశ్వాసాలను భంగపరిచేలా వున్నాయంటూ పలువురు అభ్యంతరాలు వెలిబుచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయంపై నయన్‌తో సహా చిత్ర బృందంపై మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్, ముంబయ్‌ల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి . దీంతో చిత్ర నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ ఈ సినిమాను ఓటీటీ స్ట్రీమింగ్ నుంచి తొలగించడంతోపాటు వివరణ కూడా ఇచ్చుకుంది. ఇదిలావుంటే.. రీసెంట్‌గా 'అన్నపూరణి' వ్యవహారంపై నయనతార భావోద్వేగపూరితంగా సోషల్ మీడియా ద్వారా ఓ లేఖను విడుదల చేశారు. 'బరువెక్కిన హృదయంతో ఈ లెటర్‌ను రాస్తున్నాను. నిజానికి 'అన్నపూరణి' మంచి ప్రయత్నం. ఓ మంచి ఆలోచన ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉద్దేశ్యంతో ఈ సినిమా చేశాం. సంకల్పం గట్టిదైతే ఏదైనా సాధించవచ్చు అనే మంచి విషయాన్ని ఈ సినిమా ద్వారా చర్చించాం. కానీ ఈ ప్రయత్నంలో తెలీకుండానే కొందరి మనసుల్ని బాధపెట్టాం. ఇది ఉద్దేశ్యపూర్వకంగా జరిగింది కాదు. మనోభావాలు దెబ్బతీయడం మా అభిమతం కాదు. నా 20 ఏళ్ల కెరీర్‌లో ఎవరినీ బాధపెట్టలేదు. సానుకూలంగానే ముందుకెళ్లాను. సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చిన సినిమాను ఓటీటీ నుంచి తొలిగిస్తారని అనుకోలేదు. తెలిసో తెలియకో కొందరిని బాధపెట్టాం. క్షమించమని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నాం' అంటూ సోషల్ మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు నయనతార. ఇక 'అన్నపూరణి' కథ విషయానికొస్తే.. 'అగ్నిహోత్రం లాంటి సంప్రదాయ కుటుంబంలో పుట్టిన ఓ అమ్మాయి, చెఫ్ కావాలనే తన కోరికను ఎలా సాకారం చేసుకుంది? అనే ప్రశ్నకు సమాధానంగా ఈ సినిమా రూపొందింది. నయనతార టైటిల్‌రోల్ పోషించిన ఈ చిత్రంలో సత్యరాజ్, జై కీలక పాత్రలు పోషించారు. నీలేశ్ కృష్ణ దర్శకుడు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/TbmSwCB లో చదవండి.

జాబ్ కార్నర్

డా.వైఎస్ఆర్ హెల్త్ వర్సిటీలో జూనియర్ అసిస్టెంట్స్

విజయవాడలోని డాక్టర్ వైఎస్ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 20
అర్హత: బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి
ఎంపిక ప్రక్రియ: ప్రిలిమినరీ ఎగ్జామ్, మెయిన్ ఎగ్జామ్, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
దరఖాస్తు రుసుము: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికులు, దివ్యాంగులకు రూ.750. ఇతరులకు రూ.1500.
ఫీజు చెల్లింపునకు చివరి తేదీ: జనవరి 31
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 1
వెబ్‌సైట్: drysruhs.edu.in/

ఏపీ జ్యుడీషియల్ సర్వీస్‌లో జడ్జి పోస్టులు

ఏపీ స్టేట్ జ్యుడీషియల్ సర్వీస్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్/ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అమరావతిలోని ఏపీ స్టేట్ హైకోర్ట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

పోస్టు: సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్)
ఖాళీలు: 39(32 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్; 7 ట్రాన్స్‌ఫర్ ద్వారా భర్తీ చేస్తారు)
అర్హత: లా లో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: జనవరి 31 **చివరి తేదీ:** మార్చి 1
వెబ్‌సైట్: https://aphc.gov.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/HQ81KRrలో చదవండి.

ఎన్‌పీటీఐలో పీజీ డిప్లొమా

హరియాణాలోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా 2024 వింటర్ సెషన్ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్ అనే స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా పలు మాడ్యూల్స్, ఇండస్ట్రియల్/ఫీల్డ్ ట్రెయినింగ్, ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ చివర్లో ఫైనల్ ఎగ్జామ్ నిర్వహిస్తారు. మొత్తం 360 సీట్లు ఉన్నాయి. వీటిలో 25 శాతం సీట్లను పవర్ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు ప్రత్యేకించారు.

పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: ఈ స్పెషలైజేషన్‌లో గ్యాస్, సోలార్, విండ్, బయోమాస్ తదితర పవర్ ప్లాంట్‌లకు సంబంధించిన ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ అంశాలు వివరిస్తారు. పవర్ సెక్టార్ విభాగాల నిర్వహణకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఫరీదాబాద్, నాగ్‌పూర్, నైవేలీ, శివపురి క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 చొప్పున మొత్తం 240 సీట్లు ఉన్నాయి.

రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్: ఈ స్పెషలైజేషన్‌లో రెన్యూవబుల్ ఎనర్జీ సోర్సెస్‌కు సంబంధించిన టెక్నాలజీ, ఎకనామిక్స్, పాలసీ, ఎనర్జీ సిస్టమ్స్, సప్లయ్ తదితర అంశాలు ఉంటాయి. సోలార్ ఎనర్జీ సిస్టమ్స్, ఫొటోవోల్టాయిక్ సిస్టమ్స్, థర్మల్ ఎనర్జీ సిస్టమ్స్, విండ్ ఎనర్జీ, బయోమాస్, జియోథర్మల్, టైడల్ అండ్ వేవ్ ఎనర్జీ, హైడ్రోజన్ అండ్ ఫ్యూయెల్ సెల్స్ గ్రిడ్ ఇంటిగ్రేషన్, ఇంటర్ఫేసింగ్ టెక్నాలజీస్ అంశాలు వివరిస్తారు. న్యూఢిల్లీ, బెంగళూరు క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో(బీఈ/బీటెక్/తత్సమాన కోర్సు)(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/సీ అండ్ ఐ/పవర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు రెండు స్పెషలైజేషన్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్ స్పెషలైజేషన్‌కు(బీఈ/ బీటెక్)(కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఐటీ) అభ్యర్థులు కూడా అర్హులే. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **కోర్సు ఫీజు:** నాన్ స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.2,30,000; స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.3,60,000. అదనంగా 18 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 22
- **వెబ్‌సైట్:** npti.gov.in

అదీ నా అదృష్టం



వీకే నరేశ్

నటుడిగా 50 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను అని వీకే నరేశ్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటిస్తూ. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్లే నటుడిగా సుదీర్ఘ కెరీర్ సాధ్యమైందని చెప్పారు. జీవితాంతం పరిశ్రమకు సేవ చేస్తానని పేర్కొన్నారు. ఊహ తెలిసినప్పటి నుంచి సినిమాల మధ్యనే పెరగడం వల్ల ఇదే తన జీవితం కావాలని కోరుకున్నానని చెప్పారు. తొమ్మిదో ఏట 'పండంటి కాపురం' లాంటి చిత్రంతో బాలనటుడిగా అరంగేట్రం చేయడం, ఎన్టీఆర్ లాంటి గొప్ప నటులతో కలసి పనిచేయడం తన జీవితంలో మర్చిపోలేని అనుభవం అని తెలిపారు. ఒక్క సినిమాలో హీరోగా నటించినా చాలు అనుకున్న తనకు ప్రేక్షకులు ఇంత సుదీర్ఘ సినీ కెరీర్‌ను ఇచ్చారని, వారికి రుణపడి ఉంటానని అన్నారు. నంది పురస్కారాలను అందించకపోవడంపై నరేశ్ స్పందిస్తూ 'నంది పురస్కారాలను చిత్ర పరిశ్రమలో చాలా గౌరవంగా, ఒక గుర్తింపుగా భావిస్తారు. కానీ ఇప్పుడు ఆ పురస్కారాలను ప్రభుత్వాలు అందజేయకపోవడం చాలా బాధాకరం. దీనివల్ల ఒక తరం నటీనటులకు అసలు నంది పురస్కారాలు అంటే తెలిసే అవకాశం కూడా లేకుండా పోతుంది. నంది పురస్కారాలు ఇచ్చే సంప్రదాయాన్ని ప్రభుత్వాలు మళ్లీ పునరుద్ధరించాలి' అని కోరారు. 'సేవాభావంతోనే నేను రాజకీయాల్లోకి వెళ్లాను, కానీ అక్కడ మారిన పరిస్థితుల్లో ఇమడలేక బయటకు వచ్చాను, మళ్లీ ఆ వైపు వెళ్లే ఆలోచన ప్రస్తుతానికైతే లేదు' అని నరేశ్ తెలిపారు. రాజమౌళి, మహేశ్‌బాబు కాంబినేషన్‌లో రూపొందే సినిమా తెలుగు పరిశ్రమ ఖ్యాతిని మరో స్థాయికి తీసుకెళుతుందని చెప్పారు. నటుడిగా తనని తాను కొత్త కోణంలో ఆవిష్కరించుకొనే పాత్రలు మరిన్ని వస్తున్నాయనీ, నెగెటివ్ రోల్స్ చేయాలనుందని ఆయన చెప్పారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

దార్శనికుడి దివ్యస్మృతికి దారుణ అవమానం: టీడీపీ


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

పొన్నూరు టౌన్, జనవరి 19: దార్శనికుడు ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జగన్‌రెడ్డి చేయటం అవమానం అని టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. పట్టణంలోని ఐల్యాండ్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రమం వద్ద శుక్రవారం టీడీపీ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి దళితులను దారుణంగా మోసగించారని ఆరోపించారు. దళితులకు శిరోముండనాలు, చంపి డోర్ డెలివరీలు వైసీపీ ప్రభుత్వంలోనే జరిగాయన్నారు. దళితులు దూరం అవుతున్నారనే గమనించి ఎన్నికల ముందు విగ్రహాల ఆవిష్కరణ పేరుతో దళితులను మోసగించే చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు మోసపూరిత హామీలు ఇచ్చి ఎన్నికలు అయిన తర్వాత దళితులకు 27 సంక్షేమ పథకాలు ఎత్తివేసిన ఘనత జగన్‌రెడ్డిది అని దుయ్యబట్టారు. అడుగడుగునా ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేసిన జగన్‌రెడ్డి చేతుల మీదుగా దివ్యస్మృతి ప్రారంభం కావటం సహేతుకం కాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పఠాన్ అహ్మద్‌ఖాన్, బండ్లమూడి బాబురావు, మాదాల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, ఫైరోజ్, తోటకూర నరేష్, బాజీసాహెబ్, కరిముల్లా బాజీ, గోవతోటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ప్రమాద బీమా చెక్కు అందజేత


బాధితుని కుటుంబానికి రూ.50 లక్షల ప్రమాద బీమాను అందచేస్తున్న ఎస్‌బీఐ అధికారులు

చేబ్రోలు, తెనాలి అర్బన్ జనవరి 19: ఎస్‌బీఐ ప్రమాద బీమా ఖాతాదారుల కుటుంబాలకు రక్షణగా మారుతుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేబ్రోలు శాఖ చీఫ్ మేనేజర్ ఆర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఎస్‌బీఐ ఖాతారుడి కుటుంబానికి రూ.50 లక్షల ప్రమాద బీమా సొమ్మును బ్యాంక్ అధికారులు అందచేశారు. సైనికుడిగా పనిచేసే గుమ్మడిదల కృష్ణ అనే ఖాతాదారుడు ప్రమాద బీమా ఇన్సూరెన్స్ పాలసీని ప్రతిఏటా చెల్లించి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యురాలు అంజినాదేవికి రూ.50లక్షల ప్రమాద బీమా సొమ్ము చెక్‌ను బ్యాంక్ జనరల్ మేనేజర్ ఓంనారాయణశర్మ, తెనాలి రీజనల్ మేనేజర్ కెఎంవీ నోరిప్రసాద్ అందచేశారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఆర్ఏసీ పీసీ నూతన శాఖ ప్రారంభం

తెనాలి అర్బన్, జనవరి 19: స్థానిక కొత్తపేటలోని ప్రధాన ఎస్‌బీఐ కార్యాలయం పైఅంతస్తులో ఆర్ఏసీ పీసీ నూతన శాఖను ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ఓంనారాయణశర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓంనారాయణశర్మ మాట్లాడుతూ, మారుతున్న సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. త్వరితగతిన రుణాలు మంజూరుచేస్తూ అన్ని వాణిజ్య బ్యాంకులకు దీటుగా వడ్డీరేట్లు వర్తింపజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీజీఎం దినేష్‌గులాటి, రీజనల్ మేనేజర్ ఎన్ఎల్‌కేవీ ప్రసాద్, చీఫ్ మేనేజర్ విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి బాలరాముని పూజాక్షితలు


మాజీ ఎమ్మెల్యే ఉమకు అక్షితలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

తెనాలి అర్బన్, జనవరి 19: పట్టణంలో బాలరాముని పూజాక్షితలు ఇంటింటికి పంపిణీచేసే కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమకు శుక్రవారం అక్షితలు అందజేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాటిబండ్ల రామకృష్ణ మాట్లాడుతూ, యావత్ ప్రపంచంలోని ప్రతిఒక్కరూ రాముని మందిర నిర్మాణం కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో అయోధ్యలో రామమందిర నిర్మాణం నభూతో నభవిష్యత్ అన్న రీతిలో జరుగుతుందని, ఈ నెల 22న నిర్వహించే ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి భారీఎత్తున రామభక్తులు హాజరవుతున్నారని చెప్పారు. అనంతాచార్యులు, వాసుదేవనాయుడు, తవ్వాడ శ్రీను, హనుమత్ ప్రసాద్, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు కాలనీలో ఫ్రైడే డ్రైడే ర్యాలీ


ర్యాలీని నిర్వహిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి ఉమాకాంత్, చంద్రమౌళి తదితరులు

తెనాలి, మారీసుపేట జనవరి 19: ఇంటి పరిసరాలు నీరు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని పట్టణ ప్రజలను మలేరియా సబ్ యూనిట్ అధికారి ఉమాకాంత్ కోరారు. స్థానిక మారీసుపేట నారా చంద్రబాబు నాయుడు కాలనీలో, నాజరుపేటలో శుక్రవారం మలేరియా సిబ్బంది ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నట్లతే సమీపంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ప్రభుత్వ వైద్యశాలలో జ్వర నిర్ధారణ పరీక్షలను చేయించుకొని మందులను ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. అనంతరం ఫ్రైడే డ్రైడే అవగాహన ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో యూఎల్‌బీ విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, మలేరియా ఆరోగ్య పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న రామకృష్ణ

పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

తెనాలి అర్బన్, జనవరి 19: జేఎంజే మహిళా కళాశాలలో పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాటిబండ్ల రామకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. సౌత్ ఇండియా సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో మూడు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తారు. ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, జిల్లా అసోసియేషన్‌లు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తాయి. క్రీడలను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ, శారీరక, మానసిక వికాసం క్రీడల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చూపి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కోరారు. ప్రిన్సిపాల్ షైనీ, వైకుంఠపురం చైర్మన్ కంభం సాయిబాబు, సునీల్, శివశంకర్, రవిశంకర్, రాజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్ సేవలు


ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి, మారీసుపేట జనవరి 19: పట్టణంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ల సేవలు కొనసాగుతున్నాయి. అడుసుమిల్లి సూర్యప్రకాశరావు 27వ వర్ధంతి సందర్భంగా వారి భార్య అడుసుమిల్లి స్వరాజ్యలక్ష్మి, కుటుంబ సభ్యుల సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. మార్కెట్ సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌లో ఎన్నారై విద్యాసంస్థల సహకారంతో ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాదల కోటేశ్వరరావు, వెనిగళ్ళ శివప్రసాద్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, క్రొత్తపల్లి రమేష్, సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, ముళ్ళపూడి వెంకట్, గుమ్మడి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలపై టీడీపీ, జనసేన సమష్టి పోరాటం

● టీడీపీ, జనసేన సమన్వయ కమిటీ సమావేశంలో ధూళిపాళ్ళ


చేబ్రోలులో రంగా విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నరేంద్ర కుమార్, మార్కండేయ బాబు

చేబ్రోలు, పొన్నూరు టౌన్, జనవరి 19: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అక్రమాలకు, అకృత్యాలకు వ్యతిరేకంగా టీడీపీ, జనసేన సమష్టి పోరాటం సాగిస్తుందని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు. చేబ్రోలులో శుక్రవారం పొన్నూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా చేబ్రోలులోని టీడీపీ, జనసేన కార్యాలయాలకు ఇరుపార్టీల నాయకులు ర్యాలీగా వెళ్లి ఒకరిని ఒకరు సత్కరించుకున్నారు. చేబ్రోలు కూడలిలోని వంగవీటి మోహన రంగా విగ్రహానికి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, వడ్రాణం మార్కండేయబాబు పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ కార్యాలయం జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో నరేంద్రకుమార్ మాట్లాడుతూ అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు వ్యవహరిస్తున్న ఉమ్మడి కార్యచరణ ప్రతిఒక్కరికి ఆదర్శం అన్నారు. గ్రామస్థాయి నుంచి టీడీపీ, జనసేన కలిసి నడుద్దామని పిలుపునిచ్చారు. ఉమ్మడి కార్యాచరణ రూపొందించుకొని పరస్పరం సమాచారాన్ని అందించుకోవాలని కోరారు. రాష్ట్రంలో పది తలల రావణుడి అకృత్య పాలన సాగుతుందన్నారు. అలాంటి దుర్మార్గుడి పాలనను ఎదిరించాలంటే విడివిడిగా పోరాడితే ఉపయోగం ఉండదన్నారు. వైసీపీ విముక్తి రాష్ట్రమే టీడీపీ, జనసేన పొత్తు లక్ష్యంగా పేర్కొన్నారు. జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు మాట్లాడుతూ టీడీపీ జనసేన పార్టీలు ఒకే కుటుంబంలా చేయిచేయి కలిపి వైసీపీపై పోరాడుదామని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో చేబ్రోలు మండలంలో నరేంద్ర కుమార్ పాదయాత్ర ద్వారా అక్రమ మట్టి తవ్వకాల భాగోతాలు బట్టబయలయ్యాయన్నారు. జనసేన పోరాటబలం, టీడీపీ అనుభవాన్ని కలుపుకుంటే వైసీపీని భూస్థాపితం చేయటం సులువు అన్ని మార్కండేయబాబు స్పష్టం చేసారు. సమావేశంలో మండలస్థాయి సమన్వయ కమిటీ సభ్యుల వివరాలను ఒకరికి ఒకరు ఇచ్చిపుచ్చుకున్నారు. అలాగే వడ్లమూడిలో ఈ నెల 27న జరిగే టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రా కదలి రా సభకు ఇరు పార్టీలు సమన్వయంతో పనిచేసి సభ విజయవంతం అయ్యేలా కృషిచేద్దాం అని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో నియోజకవర్గంలోని మూడు మండలాల టీడీపీ, జనసేన అధ్యక్షులు, సమన్వయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జీతాలు పెంచితేనే విధుల్లో చేరుతాం...

● అధికారుల నోటీసులకు అంగన్‌వాడీల సమాధానం


ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

తెనాలి అర్బన్, జనవరి 19: పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం జీతాలు పెంచితేనే విధుల్లో చేరుతామని ప్రాజెక్టు అధికారులు ఇచ్చిన నోటీసులకు అంగన్‌వాడీ వర్కర్లు సమాధానం ఇచ్చారు. అంగన్‌వాడీల సమ్మె నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఎస్మాకు అనుగుణంగా అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారులు వర్కర్లకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఇందుకు వ్యతిరేకంగా తెనాలి ప్రాజెక్టు కార్యాలయం వద్ద శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. షోకాజ్ నోటీసులకు సమాధానం ఇచ్చారు. నోటీసులోని 12వ పాయింట్ ప్రకారం చేసిన ఆరోపణ అవాస్తవమని సహజ న్యాయ సూత్రాలు అనుసరించకుండా నోటీసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నోటీసు ఇచ్చిన తరువాతే సమ్మె చేపట్టామని సమ్మె మొదలైనప్పుడు చట్టబద్ధమైతే జనవరి 6 నుంచి చట్ట వ్యతిరేకం ఎలా అవుతుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి వలనే సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని, వైఎస్ఆర్ పోషణ పంపిణీ తరువాతే సమ్మెలోకి వెళ్లామని ముఖ్యమంత్రి వాగ్దానం చేసిన దానికి అనుగుణంగా వేతనాలు పెంచితే సమ్మె చేయాల్సిన పరిస్థితి ఉండేది కాదని ఎస్మాను ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందని పేర్కొంటూ వెంటనే చర్చలు జరిపి వేతనాలు పెంచి సమ్మె పరిష్కారానికి కృషిచేస్తే విధుల్లో చేరతామంటూ అంగన్‌వాడీలు షోకాజ్ నోటీసుకు సమాధానం ఇచ్చారు.



నిరసన ప్రదర్శనలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

షోకాజ్ నోటీసులతో అంగన్‌వాడీలను భయపెట్టలేరు

పొన్నూరు టౌన్, జనవరి 19: ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ఇచ్చిన షోకాజ్ నోటీసులతో అంగన్‌వాడీ కార్యకర్తలను భయపెట్టలేరని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తల రిలే దీక్షలు 39వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పొన్నూరు పట్టణంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీడీపీవో కార్యాలయంలో కార్యకర్తలు తమకు ఇచ్చిన షోకాజ్ నోటీసులకు వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. విధులో చేరకపోతే తొలగిస్తామని షోకాజ్ నోటీసులు ఇచ్చి అంగన్‌వాడీలను భయభ్రాంతులకు గురిచేయాలని చూడటం దారుణం అన్నారు. అయినప్పటికీ అంగన్‌వాడీలు మొక్కవోని దీక్షతో సమ్మె కొనసాగించటం అభినందనీయం అన్నారు. వైసీపీ ప్రభుత్వం కళ్లు తెరచి అంగన్‌వాడీలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సీఐటీయూ పెదకాకాని అధ్యక్షుడు నన్నపనేని శివాజీ, పొన్నూరు కార్యదర్శి నిమ్మకూరి రమేష్‌బాబు, అంగన్‌వాడీ యూనియన్ నేతలు ఎంపీ సుకన్య, రత్నమంజుల తదితరులు తెలిపారు.

కొనసాగుతున్న ఆలపాటి పాదయాత్ర


పాదయాత్రలో ఆలపాటికి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ముస్లిం నాయకులు

తెనాలి రూరల్, జనవరి 19: మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేపట్టిన ఆలపాటి పాదయాత్రకు అడుగడుగున ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను జగన్ నెరవేర్చలేకపోయారని రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పి రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను గెలిపించుకుని రాష్ట్రాన్ని అభివృద్ధిచేసుకుందామని ఆలపాటి పిలుపునిచ్చారు. శుక్రవారం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కంచర్లపాలెం నుండి పాదయాత్రగా బయలుదేరి సోమసుందరపాలెం, ఆటోనగర్ మీదుగా తేలప్రోలు చేరుకుని అదే గ్రామంలో బసచేశారు. దారిపొడవునా ఆలపాటికి ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు దిష్టితీసి ఆలపాటి నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ఆలపాటి బొమ్మను ముద్రించిన చిత్రపటాన్ని ఆలపాటికి ముస్లిం నాయకులు అందించారు. మండల పార్టీ అధ్యక్షుడు కేసన కోటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో టీడీపీ, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగానికి పాతర వేసిన జగన్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాతర వేసి తాతరాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ఇప్పుడు అంబేద్కర్ వాదినంటూ విజయవాడలో ఆయన విగ్రహాన్ని ప్రారంభించడం ఆయన రెండునాలుకల ధోరణికి నిదర్శనమని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాదయాత్రలో మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం ఎక్కడా కూడా అమలు కావడంలేదన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించలేని జగన్ విగ్రహాలు పెట్టి అంబేద్కర్ పేరుతో రాజకీయం చేసేందుకు తెరలేపారని ఆరోపించారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌కు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలందరూ ఎదురు చూస్తున్నారని అన్నారు.


నృత్య ప్రదర్శన చేస్తున్న విదేశీ వనితల

అలరించిన విదేశీ వనితల నృత్యాలు

తెనాలి అర్బన్, జనవరి 19: మారీసుపేటలోని దయమణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ వార్షికోత్సవంలో విదేశీ వనితలు అలరించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో ఆస్ట్రేలియాలోని నార్త్ డోమ్ యూనివర్శిటీలో ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న అత్రోట విద్యాసాగర్‌తో కలిసి పలువురు విదేశీ మహిళలు వార్షికోత్సవంలో పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి సందడి చేశారు. ప్రిన్సిపాల్ హేమలత, రత్నశేఖర్, విజయ్‌కుమార్, గాంధీ ప్రసంగించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన ఉండాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, జనవరి 19: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో వి.విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధులు గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సమావేశాలు నిర్వహించవలసిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. ఎంపీపీ భీమవరపు పద్మావతి మాట్లాడుతూ గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ పూర్ణశంకర్ రావు, పరిపాలనాధికారి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు సుబ్బారావు మృతి


సుబ్బారావు (ఫైల్ ఫొటో)

పొన్నూరుటౌన్, జనవరి19: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ బొప్పన సుబ్బారావు (71) శుక్రవారం మృతి చెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి అనుచరుడిగా కొనసాగిన బొప్పన సుబ్బారావు కసుకర్రు గ్రామ సర్పంచ్‌గా పని చేసారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సుబ్బారావు శుక్రవారం మృతిచెందారు. ఆయన మృతికి టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ బొప్పన సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.


బాలింతలకు పండ్లను పంపిణీ చేస్తున్న చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు చిన్నకృష్ణారెడ్డి, విజయభాస్కరరెడ్డి తదితరులు

ఘనంగా యోగి వేమన జయంతి

తెనాలి, మారీసుపేట జనవరి 19: స్థానిక చెంచుపేటలోని జిల్లా వైద్యశాలలో శుక్రవారం శ్రీయోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యోగి వేమన (యోగి యేమారెడ్డి) జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి అధ్యక్షుడు కిక్కురి చిన్నకృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమన రాసిన పద్యాలు జీవన సత్యాలని ప్రతిఒక్కరూ వాటిని అనుసరించాలని, తోటివారికి సహాయపడాలని కోరారు. రానున్న రోజులలో మరిన్ని సేవా కార్యక్రమాలను ప్రజల కోసం చేస్తామని తెలిపారు. అనంతరం బాలింతలకు, రోగులకు పండ్లను పంపిణీ చేశారు. చారిటబుల్ ట్రస్ట్‌కు కిక్కురి వెంకట సత్యానారాయణరెడ్డి రూ.30వేల రూపాయలు, తిరుమల రెడ్డి లక్ష్మారెడ్డి రూ.2500 విరాళాన్ని అందించారు.

రేపు సురభి కళాకారుల మాయాబజార్ నాటక ప్రదర్శన

తెనాలి అర్బన్, జనవరి 19: సురభి కళాకారులతో మాయాబజార్ నాటకాన్ని ఆదివారం ప్రదర్శించనున్నట్లు పట్టణ రంగస్థల కళాకారుల సంఘ ప్రతినిధులు తెలిపారు. పెన్షనర్స్ హాలులో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ, తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ప్రదర్శించే నాటకాన్ని ప్రఖ్య చిల్డ్రన్ ఆర్ట్స్ థియేటర్ నిర్వహిస్తుందన్నారు. నాటక ప్రదర్శన పురస్కరించుకుని చల్లా యామిని శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు, జానపద నృత్య ప్రదర్శనలు చేస్తారని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

అసత్య ప్రచారాలతో నీచస్థాయికి జగన్: ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, జనవరి 19: ఓట్ల కోసం అసత్య ప్రచారాలు చేస్తూ జగన్‌రెడ్డి నీచస్థాయికి దిగజారాడని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చివేస్తామని తాను చెప్పినట్లు అబద్ధపు మాటలు ప్రచారం చేయిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. జగన్ ఇచ్చే చిల్లర పైసలకు కక్కుర్తిపడి పేటీఎం బ్యాచ్‌లు కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు చిల్లరపోస్టులు పెడుతున్నారన్నారు. కుల, మతరహిత ఆధునిక భారతదేశం కోసం అంబేద్కర్ చేసిన పోరాటంపై టీడీపీతోపాటు తమకు ఎంతో గౌరవం ఉందన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టించి ప్రజల్లో గందరగోళం సృష్టించి తిరిగి అధికారంలోకి రావాలని కుట్రలు పన్నుతున్నారన్నారు. ప్రజలు జగన్‌ను నమ్మే పరిస్థితి లేదన్నారు. అసత్య ప్రచారాలు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని నరేంద్ర కుమార్ హెచ్చరించారు.



బకాయిలు చెల్లించాలని ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

బకాయిలు చెల్లించాలని ఉపాధ్యాయుల ఆందోళన

తెనాలి అర్బన్, జనవరి 19: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు బకాయిపడ్డ రూ.17 వేల కోట్లు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేశారు. తెనాలి ప్రాంతీయ కార్యాలయం నుంచి పట్టణంలోని శివాజీ చౌక్, గాంధీ చౌక్‌లో నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి మోకాళ్లపై నడిచారు. కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పీఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ, 12వ పీఆర్‌సీ విధి విధానాలు వెంటనే రూపొందించి 30శాతం ఐఆర్‌ను తక్షణమే చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. డీఏ బకాయిలు, సరెండర్ లీవ్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, మెడికల్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. గయాసుద్దౌలా, సాంబశివరావు, బసవేశ్వరరావు, కామాక్షి, సౌజన్య ప్రదీప్, కాలేషా, ప్రసాద రెడ్డి, కేదార్‌నాథ్ పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్: ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు తక్షణమే విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.భవన్నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి టి సాయికృష్ణ, పొన్నూరు పరిసర ప్రాంతాల యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

తక్కెళ్ళపాడులో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు


ధూళిపాళ్ల నరేంద్ర సమక్షంలో టీడీపీలో చేరిన తక్కెళ్ళపాడు వైసీపీ నాయకులు

పెదకాకాని, జనవరి 19: పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో భారీగా చేరారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. తక్కెళ్లపాడు చెందిన యేగినేని విక్రమ్, కొమ్మూరి సదాశివరావు, పిల్లుట్ల సాంబశివరావు, కొమ్మూరి సీతరామయ్య, కొండూరి సాంబశివ రావు, పలు కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో పెదకాకాని మండల పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, మోపర్తి వేణు, ఆలపాటి సంపత్, భైరపనేని లక్ష్మీనారాయణ, కూచిపూడి రాజేష్, మాచవరపు మల్లికార్జునరావు, నందిపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ మేరీస్‌లో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ

గుంటూరు (తూర్పు), జనవరి 19: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని గుంటూరు గ్రూప్ ట్రైనింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ మనోజ్‌కుమార్ అన్నారు. స్థానిక చేబ్రోలు, సెయింట్ మేరీస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ బెటాలియన్ 8వ వార్షిక శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రైఫిల్ షూటింగ్‌పై ఎన్‌సీసీ క్యాడెట్లుకు శిక్షణ అందించారు. కార్యక్రమంలో క్యాంపు కమాండెంట్, లెఫినెంట్ కల్నల్ సుదర్శన్, డిప్యూటీ కమాండెంట్, లెఫినెంట్ కల్నల్ సత్యనారాయణ, క్యాంపు సుబేదార్ మేజర్ రఫీ, కళాశాల చైర్మన్ డాక్టర్ కే వీ రావు, విద్యార్థినులు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

వీవీఐటీకి 'ఐయూసీఈఈ' అవార్డు


మయుఖతో వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, తదితరులు

పెదకాకాని, జనవరి 19: ఇంజనీరింగ్ విద్యాప్రమాణాల పెంపు కోసం ప్రారంభించిన ఇండో యూనివర్సల్ కొలాబరేషన్ ఫర్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ సంస్థ కర్ణాటక రాష్ట్రంలోని కేఎల్ఈ టెక్నలాజికల్ యూనివర్శిటీ హుబ్లీలో నిర్వహించిన ఐసీటీఐఈఈ 2024లో వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన అధ్యాపకుడు డాక్టర్ కె.గిరిబాబుకు 'టీచింగ్ అండ్ లెర్నింగ్ సెంటర్ లీడర్‌షిప్ అవార్డు, ఐటీ విభాగానికి చెందిన విద్యార్థిని కుకునూరి యుక్తశ్రీ మయుఖకు 'అవుట్ స్టాండింగ్ స్టూడెంట్ లీడర్ అఫ్ ది ఇయర్' అందుకున్నట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. భారతదేశంలో ఇంజనీరింగ్ విద్యా ప్రమాణాలు, పరిశోధనల నాణ్యత పెంపుకోసం కృషిచేసే ఐయూసీఈఈ ఆధ్వర్యంలో వీవీఐటీలో విద్యార్థి విభాగం, టీచింగ్ లెర్నింగ్ సెంటర్ నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం యుక్తశ్రీను వీవీఐటీ చైర్మన్ విద్యాసాగర్, వైస్‌చైర్మన్ మహదేవ్, ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి, ఐయూసీఈఈ సభ్యుడు డాక్టర్ కేవీఎల్ సోమశేఖర్, అధ్యాపకులు అభినందించారు.

వైసీపీకి బీసీ సీనియర్ నాయకుడు బ్రహ్మయ్య రాజీనామా

పొన్నూరు టౌన్, జనవరి 19: వైసీపీకి పట్టణ బీసీ సెల్ మాజీ అధ్యక్షుడు కొండిబోయిన బ్రహ్మయ్య శుక్రవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సామాన్య భవన నిర్మాణరంగ కార్మికమేస్త్రిగా ఉన్న తాను రాజశేఖర్‌రెడ్డి పాలనతో ఆకర్షితుడనై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు చెప్పారు. రావి వెంకట రమణ నాయకత్వంలో కష్టనష్టాలకు ఓర్చి వైసీపీలో క్రియాశీలకంగా పనిచేసినట్లు చెప్పారు. తమ సేవలు గుర్తించి పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. అయితే పార్టీ ప్రతిష్ఠకోసం జరిగిన పోరాటంలో తనపై, తన కుటుంబ సభ్యులపై కేసులు నమోదైనట్లు చెప్పారు. కానీ తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఒక ఓటు కూడా ప్రభావితం చేయలేని వ్యక్తికి పదవిని కట్టబెట్టి తన మనోభావాలను దెబ్బతీశారని ఆరోపించారు. అందుకే వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. అభిమానులతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానన్నారు.